
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పల్నాడు జిల్లా వార్తలు

5

మంగళవారం 17 జూన్ 2025

ఉష్ణోగ్రత (అంచనా) 17-6-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	37	28
తెనాలి	36	28
నరసరావుపేట	36	27
బాపట్ల	36	28
రెంటచింతల	36	27
చీరాల	36	28

కౌలు రైతు సుఖీభవ అనేంది

సొంత పొలం ఉన్న వారి వివరాలు మాత్రమే

అన్నదాత సుఖీభవ పథకానికి ప్రస్తుతం సొంత పొలం యజ మానుల వివరాలనే నమోదు చేయాలనే ఆదేశాలు మాత్రమే ప్రభుత్వం నుంచి వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. కౌలు రైతులకు పథకం వర్తింప చేయడంపై తమకు ఎలాంటి మార్గ దర్శకాలు రాలేదనేది యంత్రాంగం మాటగా ఉంది. పెట్టుబడి సాయంలో చేదోడువాదోడుగా ఉండే అన్నదాత సుఖీభవ పథకం తమకు అందించే విషయంలో ప్రభుత్వం ఇంకా ఎటువంటి నిర్ణయానికి రాకపోవడం పట్ల కౌలు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



అన్నదాత సుఖీభవ పథకం లబ్ధిలో అయోమయం

- అర్హులుగా సొంత పొలం యజమానులు
- కౌలు దారుల సంగతి ఎటూ తేల్చని ప్రభుత్వం
- సీసీఆర్ కార్డుల జారీ ఇంకా ప్రారంభ దశలోనే
- మనుగడలో ఉన్న కార్డులు నిరుపయోగంగానే..
- పెట్టుబడి ఖర్చులకు ఏం చేయాలో పాలుపోని కౌలు రైతులు

అన్నదాత సుఖీభవ పథకం కింద పెట్టుబడి సాయం రైతులకు అందించడానికి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇప్పటికే అర్హులైన లబ్ధిదారుల జాబితా విషయంలో వ్యవసాయ శాఖ తుది నిర్ణయానికి వచ్చింది. మరో మూ డు నాలుగు రోజుల్లో అన్నదాతల ఖాతాల్లో పెట్టుబడి సాయం జమ చేసేలా వడివడిగా ప్రభుత్వం అడుగు లేస్తోంది. కానీ, కౌలు రైతులకు ఈ సాయం అందడంపై నీలి మేఘాలు కమ్ము కున్నాయి. ఇప్పటి వరకు వారికి పెట్టుబడి సాయం అందిం చడంపై ఎలాంటి మార్గదర్శ కాలను ప్రభుత్వం విడుదల చేయ లేదు. దీంతో అన్నదాత సుఖీభవ పథకం తమకు ఎండమావిగానే మిగలనుందా అనే ఆందోళనను కౌలు రైతులు వ్యక్తం చేస్తున్నారు.

(నరసరావుపేట ఆంధ్రజ్యోతి)

కౌలు రైతులకు సీసీఆర్ కార్డుల (పంట సాగు హక్కు పత్రాలు) జారీ ప్రక్రియ ఈ పాటికే ఓ కొలిక్కి రావాల్సి ఉండగా.. ఇంకా ప్రారంభ దశలోనే ఉండడం వారిని మరింత కలవరపరుస్తోంది. కౌలు రైతుకు ఏ ప్రయోజనం దక్కాలన్నా సీసీఆర్ కార్డే ప్రామాణికం చేయడంతో పాటు.. ఓ ప్రణాళిక లేని నిర్ణయాలతో గత ప్రభుత్వం వారి ప్రయోజనాలకు పెద్ద ఎత్తున గండి కొట్టిన సంగతి తెలిసిందే. సీసీఆర్‌సీ స్థానంలో కొత్త కౌలు చట్టం తెస్తామని ప్రస్తుత ప్రభుత్వం గతంలో ప్రకటించింది. కానీ, ఇంతవరకు అది కార్యరూపం దాల్చకపోగా ఖరీఫ్ పనులు మొదలైనా సీసీఆర్ కార్డుల జారీ కనీసం 20 శాతం కూడా పూర్తి కాకపోవడం వ్యవసాయశాఖ వైఫల్యంగా కనబడుతోంది. అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి ప్రభుత్వం తమ గోడు కూడా ఆలకించాలని, ఇప్పటికే వ్యాలిడిటీ ఉన్న కార్డుల విషయంలో పథకం అమలుపై ఆలోచించాలని కౌలు రైతులు ప్రభుత్వాన్ని వేడుకొంటున్నారు.

◆ **కౌలు రైతులే అధికం**

బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాల పరిధిలో దాదాపు 4.50 లక్షల మంది వరకు కౌలురైతులు ఉంటారనేది ఓ అంచనా. వీరిలో సొంత పొలం కనీసం అరెకరం

(మిగతా 8వ పేజీలో)



పల్నాడు రోడ్డులో మాంసం షాపుల తొలగింపు

మాంసం షాపుల తొలగింపు

నరసరావుపేట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పల్నాడు రోడ్డులో మాంసం విక్రయ షాపులను సోమవారం మునిసిపల్ ప్రణాళిక విభాగం తొలగించింది. అక్కడ షాపులు.. ఇక్కడ కోతలు అనే శీర్షికన పల్నాడు రోడ్డులో మాంసం విక్రయాలపై వెలువడిన వార్తకు కమిషనర్ జస్వంత్ స్పం దించారు. ఆయన ఆదేశాల మేరకు టీపీవో సాంబయ్య షాపుల తొలగింపు చేపట్టారు. అయితే మున్సిపల్ కాంప్లెక్స్‌లోని మటన్, చేపల దుకాణాలను వినియోగంలోకి తీసు కొచ్చేందుకు అధికారులు చర్యలు చేపట్టాలి. రోడ్ల వెంట మాంసం విక్రయాలు, జం తు వధను పూర్తిగా నిరోధించి వ్యాపారులకు మునిసిపల్ షాపులు కేటాయిస్తే ముని సిపాల్టీకి ఆదాయం వచ్చే అవకాశం ఉంది.

బ్యాంకు రుణాలే శ్రేయస్కరం

- రుణ మేళాలో ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు
- 50 మందికి రుణాల మంజూరు

నరసరావుపేట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : రుణాల కోసం బ్యాంకును మాత్రమే ఆశ్రయించడం అన్ని విధాలా శ్రేయస్కరమని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. సోమవారం పల్నాడు కలెక్టరేట్‌లో జరిగిన రుణమేళాలో ఆయన పాల్గొన్నారు. వివిధ పథకాల కింది 50 మందికి రుణ మంజూరు పత్రాలను ఎంపీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వివిధ రకాల డాక్యుమెంట్లు



రుణ మంజూరు పత్రాలను పంపిణీ చేస్తున్న ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, కలెక్టర్ అరుణ్‌బాబు

సమర్పించడం సాధ్యం కాదని, రుణం పొందడం ఆలస్యం అవుతుందనే ఆలోచనలతో చాలా మంది బ్యాంకులకు బదులుగా బయట వ్యక్తుల వద్ద ఎక్కువ వడ్డీకి డబ్బులు తెచ్చుకుని రుణభారంతో సతమవుతున్నారన్నారు. బ్యాంకులు రుణాలు అందించేందుకు ఉన్నాయని, ప్రభుత్వ పథకాల ద్వారా అందించే బ్యాంకు రుణాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ఎంపీ సూచించారు. ఇక నుంచి జిల్లాలో రెండు సార్లు రుణమేళాలు నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేస్తామన్నారు. ఒక సారి కలెక్టరేట్‌లో మరోసారి అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంలో నిర్వ హిస్తామన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ అరుణ్ బాబు మాట్లాడుతూ, బ్యాంకులకు అందిన రుణ దరఖాస్తులను అక్కడికక్కడే పరిశీలించి రుణ వితరణ చేపడతామన్నారు. కలెక్టరేట్‌లో జరిగిన రుణ మేళాలో మొత్తం 338 దరఖాస్తులను పరిశీలించి, 50 మంది చిరు వ్యాపారులకు ఒక్కొక్కరికి రూ.1 లక్ష చొప్పున మొత్తం రూ.50 లక్షలు స్వయం ఉపాధి రుణాలు మంజూరు చేశారు. నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ పథకం కింద మరో రూ.32 లక్షలు మంజూరు చేశారు. కార్యక్రమంలో ఎల్డీఎం రామ్ ప్రసాద్, డీఆర్డీఏ పీడీ ఝాన్సీ రాణి, యూనియన్ బ్యాంకు ప్రాంతీయ అధిపతి మాధురి, ఆంధ్ర ప్రదేశ్ గ్రామీణ బ్యాంకు ప్రాంతీయ అధిపతి సుభాష్ పాల్గొన్నారు.

20 లక్షల ఉద్యోగాలే లక్ష్యం

- బాధ్యతతో అవకాశాలు అందిపుచ్చుకోవాలి
- మెగా జాబ్‌మేళాలో ఎమ్మెల్యే జూలకంటి

మాచర్లటౌన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): 20 లక్షల ఉద్యోగాలే కూటమి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకొని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పనిచేస్తున్నారని మాచర్ల శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని ఎస్వీఆర్ డిగ్రీ కళాశాలలో ఏపీ స్కూల్ డెవలప్‌మెంట్, కళాశాల యాజమాన్యం సంయుక్తంగా ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళాకు ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ జాబ్‌మేళాకు 250 మంది నిరుద్యోగ యువత



ఉద్యోగాలు పొందిన వారిని అభినందిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

హాజరుకాగా 11 కంపెనీల ప్రతినిధులు 132 మందిని ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేసి ఆఫర్ లెటర్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ కష్టపడి చదివించిన తల్లిదండ్రుల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించి, ఉద్యోగాల వేటకు యువత పరుగులు తీయాలన్నారు. ఉన్నత ఉద్యోగాలను సాధించి కుటుంబానికి, పుట్టిన గడ్డకు మంచి పేరు తీసుకురావాలని కోరారు.

సంవత్సరం కాలంలో 2250 మందికి ఉద్యోగాలు..

కూటమి పాలనలో గడిచిన సంవత్సరం కాలంలో మాచర్ల నియోజకవర్గంలో ఐదుసార్లు జాబ్‌మేళాలను నిర్వహించి దాదాపు 3650 మంది నిరుద్యోగులను ఎంపిక చేయగా, ఇందులో 2250 మంది ప్రస్తుతం వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు చేస్తున్నారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా సీఎం చంద్రబాబు నాయకత్వంలో పెట్టుబడుల యజ్ఞం జరుగుతోందన్నారు. ఇప్పటి వరకు రూ.9 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించి పరిశ్రమల స్థాపన వైపు కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. రాష్ట్రం ప్రశాంతంగా ఉన్నప్పుడే పెట్టుబడులు వస్తాయని, అటువంటి వాతావరణాన్ని పులివెందుల ఎమ్మెల్యే జగన్‌రెడ్డి చెడగొడుతున్నారని ఆరోపించారు. నియోజకవర్గంలో విద్యా ప్రమాణాలను పెంపొందించే దిశగా విద్యావేత్తలు అడుగులు పడాలని కోరారు. యువతకు ఉద్యోగ అవకాశాలను కల్పించే దిశగా కృష్ణవేణి జూనియర్ కళాశాల, ఎస్వీఆర్ కళాశాల యాజమాన్యం యనమదల వెంకట్రామయ్య చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి తమ్మాజీరావు, మున్సిపల్ చైర్మన్ షేక్ మదార్‌సాహెబ్, జి సుబ్బారావు, సీహెచ్ శ్రీనివాసరావు, జిల్లా ఉద్యోగ కల్పనా అధికారి ఎం రవీంద్రనాయక్, మాచర్ల స్కిల్ హబ్ కోఆర్డినేటర్ ఆర్ కిరణ్‌నాయక్, రామాంజినేయులు, అంజిరెడ్డి, వీరాంజనేయులు, జానీబాషా, శ్రీకాంత్, రామకృష్ణారెడ్డి, సంబోజు వేణు, పంగులూరి పుల్లయ్య, వజ్రం నాయక్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొమెర దుర్గారావు, బీజేపీ పట్టణ అధ్యక్షుడు ఓర్సు క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల.. బదిలీలకు శ్రీకారం!



- మార్గదర్శకాలు విడుదల చేసిన ప్రభుత్వం
- ఒకే చోట ఐదేళ్ల సర్వీస్ ఉంటే.. బదిలీ తప్పనిసరి
- స్వగ్రామం, సొంత మండలాల్లో నియామకానికి చెక్
- ఈ నెల 30 నాటికి ప్రక్రియ పూర్తి
- ఉమ్మడి జిల్లాల ఆధారంగా బదిలీలు

గుంటూరు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల బదిలీల ప్రక్రియలో భాగంగా.. ఇప్పుడు సచివాలయ ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పోయిన అయిదేళ్లలో బదిలీలు లేకపోవడంతో కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే బదిలీలకు అవకాశం కల్పించింది. గతేడాది నవంబరులో పరిమిత స్థాయిలో బదిలీలు జరగ్గా.. ఇప్పుడు జీవో నంబరు 5 ప్రకారం మొత్తం ఉద్యోగుల బదిలీకి అవకాశం కల్పించింది.

● **ఐదేళ్లు దాటితే స్థాన చలనం తప్పదు**

సచివాలయ ఉద్యోగుల బదిలీలకు కిందటేడాది ప్రభుత్వం అవకాశం కల్పించినా మెజారిటీ ఉద్యోగులు బదిలీలకు సిద్ధపడలేదు. దీంతో నామమాత్రంగానే బదిలీలు జరిగాయి. దీంతో ఇప్పుడు ప్రభుత్వం సచివాలయాల్లో పాతుకుపోయిన వారిని బదిలీ చేసేందుకు పూనుకుంది. ఒకే సచివాలయంలో ఐదేళ్లపాటు విధుల్లో ఉన్న ఉద్యోగులను వేరే సచివాలయానికి బదిలీ చేస్తూ జీవో జారీ చేసింది. ఐదేళ్లు పూర్తికాని ఉద్యోగుల వ్యక్తిగత అభ్యర్థనపై బదిలీ అయ్యేందుకు అవకాశం కల్పించింది. అయితే ఉద్యోగులు ఎవరూ వారి సొంత గ్రామాలు, మండలాలకు బదిలీ అయ్యే వీలు లేదు. దీనిపైనే.. ఉద్యోగ సంఘాలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. తక్కువ జీతాలతో పనిచేసే వారికి సొంత ప్రాంతంలో పనిచేసుకునే అవకాశం కల్పిస్తే ఆర్థిక భారం తప్పుతుందని చెబుతున్నారు. బదిలీల జీవో వచ్చిన వెంటనే వారు సంబంధిత అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.

ఉమ్మడి గుంటూరు జిల్లాలో మొత్తం 1,322 గ్రామ/వార్డు సచివాలయాలు ఉన్నాయి. గుంటూరు జిల్లాలో 562, పల్నాడు జిల్లాలో 532, బాపట్ల జిల్లాలోని ఉమ్మడి గుంటూరు జిల్లా వరకూ 228 సచివాలయాలు ఉన్నాయి మొత్తంగా ఉమ్మడి జిల్లాలో 824 గ్రామ సచివాలయాలు ఉండగా వాటిలో 7,069 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరి కోసం ఒక మాడ్యూల్ రూపొందించారు. వీరి బదిలీలకు సంబంధించిన ఖాళీల ఎంపిక ఎంపీడీవోలకు అప్పగించారు. కాగా ఉమ్మడి జిల్లాలో 439 వార్డు సచివాలయాల్లో 3,912 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. వారి కోసం వేరొక మాడ్యూల్ రూపొందించారు. వీరి బదిలీలకు సంబంధించిన ప్రక్రియని మున్సిపల్ కమిషనర్లకు అప్పగించారు. వారే తమ పరిధిలో ఉన్న ఖాళీల వివరాలను నమోదు చేసి, కలెక్టర్‌కు నివేదిక సమర్పిస్తారు.

● **ప్రత్యేక కేటగిరీలకు ప్రాధాన్యం**

కంటి చూపులేని, బుద్ధి మాంద్యం పిల్లలున్న ఉద్యో గులకు వైద్య సదుపాయాలు అందుబాటులో ఉన్న చోటే పోస్టింగులు ఇచ్చేలా చర్యలు తీసుకోనున్నారు. గిరిజన ప్రాంతాల్లో రెండేళ్లకు మించి సర్వీసు ఉన్నవారికి, వైకల్యం 40 శాతానికి మించి ఉన్నవారికి, ఆరోగ్య కారణాల రీత్యా (మిగతా 8వ పేజీలో)

ఉద్యోగుల ఎంపిక సమయంలో జరిగిన విధంగానే ఉమ్మడి జిల్లాల ఆధారంగా బదిలీల ప్రక్రియ ఉంటుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఉమ్మడి జిల్లా కలెక్టర్లే అప్పాయింటింగ్ అధికారులుగా వ్యవహరిస్తారు. బదిలీ ఆదేశాలు వారే ఇస్తారు. హెచ్‌ఆర్ఎంఎస్ పోర్టల్లో రెండు మాడ్యూళ్లలో అభ్యర్థులు తమ బదిలీలకు సంబంధించి దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించింది.

సబ్సిడీ.. శత శాతం







- పండ్లు, పూల తోటలకు ఉపాధి నిధులు
- చిన్న, సన్నకారు రైతులకు ఉపయుక్తం
- జిల్లాలో 3,500 ఎకరాల్లో ఉద్యాన పంటల సాగు లక్ష్యం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

సన్న, చిన్న కారు రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ఇప్పటికే గోకులాల పథకం కింద పాడి రైతులకు షెడ్ల నిర్మాణాలకు నిధులు ఇచ్చింది. మీ ఉపాధి.. మాది హామీ అంటూ ప్రభుత్వం ఉద్యాన పంటల సాగుకు ఉపాధి పథకంతో ఊతం ఇస్తోంది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం చిన్న సన్న కారు రైతులకు పూలు, పండ్ల తోటల సాగుకు ఆర్థిక సాయం నూరు శాతం సబ్సిడీతో అందిస్తోంది. దీని ద్వారా బీడు భూములను సాగులోకి తీసుకురావడంతో పాటు జల వనరులను సంరక్షించడానికి చర్యలు తీసుకుంటోంది. ఈ ఏడాది జిల్లాలో 3,500 ఎకరాల్లో ఉద్యాన పంటల సాగు చేపట్టేలా లక్ష్యం నిర్ణయించారు. ఈ మేరకు లబ్ధిదారులైన రైతుల నుంచి 25 వరకు ఉద్యాన పంటల సాగుకు దరఖాస్తులను జిల్లా నీటి యాజమాన్య సంస్థ స్వీకరిస్తోంది.

రాయితీ, అర్హతలు

గతేడాది 1,243 ఎకరాల్లో వర్షాధారిత ఉద్యాన పంటలను సాగు చేశారు. ఈ ఏడాది 3,500 ఎకరాల్లో ఉద్యాన సాగు చేపట్టాలని లక్ష్యం. ఇందుకు ఎస్సీ, ఎస్టీ, ఐదు ఎకరాలలోపు అన్ని వర్గాల చిన్న సన్న కారు రైతులు అర్హులు. సాగు చేపట్టిన పండ్లు, పూల తోటల నిర్వహణకు ఎకరానికి రెండు నుంచి మూడేళ్లకు రూ.68,103 నుంచి రూ.2,51,226లు సదరు రైతులకు చెల్లిస్తారు. ఈ మొత్తం నూరు శాతం సబ్సిడీనే. ఇందుకు ఉపాధి పథకం జాబ్ కార్డు ఉండి, ఆసక్తిగల రైతులు ఈ నెల 25లోగా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ పి.అరుణ్‌బాబు తెలిపారు. గ్రామంలోని క్షేత్ర సహాయకులు (ఫీల్డ్ అసిస్టెంట్), గ్రామ కార్యదర్శికి రైతులు దరఖాస్తులు అందజేయాలని సూచించారు. మండల పరిషత్ కార్యాలయం కూడా దరఖాస్తులు దాఖలు చేయవచ్చని తెలిపారు. జిల్లాలో అర్హులైన రైతులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

ఈ తోటలు సాగు చేసుకోవచ్చు..

జిల్లాలో రెండు రకాల పూలు, 16 రకాల పండ్లు, మునగ తోటల సాగు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అందులో వర్షాధారిత మామిడి, బత్తాయి, నిమ్మ, జామ, తైవాన్ జామ, సపోట, కొబ్బరి, నేరేడు, చింత, సీతాఫలం, దానిమ్మ, అంజూర, యాపిల్ బేర్, అవకాడో, డ్రాగన్ ఫ్రూట్, జీడి మామిడి పండ్ల తోటలు, గులాబీ, మల్లె ఈ రెండు రకాల పూల తోటల సాగుకు అనుమతిస్తున్నారు.

సమగ్ర విచారణ జరపండి
- చిలకలూరిపేట మున్సిపాలిటీలో రూ. 34 లక్షల కుంభకోణంపై ఎంపీ లావు లేఖ

మందకొడిగా... మిర్చి ఎగుమతులు
- మార్కెట్‌లో తగ్గిన జోష్
- రోజుకు సగటును 35 వేల టిక్కీల విక్రయం



చదువులకు.. శ్రీనిధి బాసట
- డ్వాక్రా మహిళల పిల్లలకు ప్రయోజనం

8 **వేట..మొదలు**
- సముద్రుడికి పూజలు
- చేపల వేటకు పయనమైన గంగపుత్రులు

జిల్లా ప్రజా రవాణాధికారిగా.. విమల బాధ్యతల స్వీకారం

● నెల్లూరు జోన్ డిప్యూటీ సీటీఎంగా రవికాంత్ రిలీవ్



డీపీటీవోగా బాధ్యతలు స్వీకరిస్తున్న విమల

గుంటూరు, జూన్16 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజా రవాణాధికారిగా సీహెచ్ విమల గుంటూరు ఎన్టీఆర్ బస్టాండ్‌లోని కార్యాలయంలో సోమవారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. విజయవాడలోని ఆర్టీసీ కేంద్ర కార్యాలయంలో డిప్యూటీ సీఎంఈ (వర్క్స్)గా వ్యవహరిస్తోన్న ఆమె గుంటూరు డీపీటీవోగా నియమితులైన విషయం తెలిసిందే. నెల్లూరు జోన్ డిప్యూటీ సీటీఎం (ఓఅండ్‌సీ)గా బదిలీ అయిన రవికాంత్ ఇక్కడ బాధ్యతల నుంచి రిలీవ్ అయ్యారు. నూతన డీపీటీవో విమల మాట్లాడుతూ ఆర్టీసీ అభివృద్ధికి, ప్రయాణికులకు మెరుగైన సేవలందించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. ఇందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని కోరారు. డిప్యూటీ సీఎంఈ కె.సత్యనారాయణ, పీవో పి మాలతి, డిపో మేనేజర్లు, ఇతర అధికారులు, సిబ్బంది నూతన డీపీటీవోకు పుష్పగుచ్ఛాలతో శుభాకాంక్షలు తెలియజేశారు.

పెట్రోల్ పోసుకుని కుటుంబం ఆత్మహత్యాయత్నం

❖ జిల్లా పోలీసు కార్యాలయం ఎదుట కలకలం



జిల్లా పోలీసు కార్యాలయం ఎదుట పెట్రోలు పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన కొపనాతి శ్రీనివాసరావు, ఝాన్సీ దంపతులు

బాపట్ల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): అవసరానికి అప్పు ఇచ్చిన వ్యక్తి సాక్షి సంతకం పేరుతో తమ ఎకరం రొయ్యల చెరువు రాయించుకున్నాడని, ప్రశ్నిస్తే చంపుతామని బెదిరిస్తున్నాడని.. తమకు న్యాయం చేయాలంటూ భార్యభర్తలు ఇద్దరు పిల్లలతో సహా పెట్రోల్ పోసుకుని సోమవారం జిల్లా పోలీసు కార్యాలయం ఎదుట ఆత్మహత్యాయత్నం చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక వద్ద ఘటన ఒక్కసారిగా కలకలం రేపింది. పోలీసులు అప్రమత్తమై వారిని అడ్డుకుని, వివరాలు సేకరించారు. బాధితుల వివరాల మేరకు.. బాపట్ల జిల్లా నిజాంపట్నం మండలం హారీస్‌పేటకు చెందిన కొపనాతి శ్రీనివాసరావుకు రెండెకరాల రొయ్యల చెరువు ఉంది. సమీప గ్రామం పాత హారీస్ పేటకు చెందిన మోపిదేవి పోతురాజు దగ్గర రూ.3 లక్షలు అప్పు తీసుకున్నాడు. పోతురాజు వడ్డీ వసూలు చేసింది చాలక.. పొలం కొన్నానని రిజిస్ట్రేషన్ కోసం సాక్షి సంతకం కావాలని చెప్పి శ్రీనివాసరావును తీసుకెళ్లి అతని.. ఎకరం రొయ్యల చెరువును రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. కొద్ది రోజులు తర్వాత మరొకరికి విక్రయించాడు. ఇదేమిటని ప్రశ్నిస్తే.. అప్పు ఇచ్చిన నగదుకు చెరువు తీసుకున్నానని, గొడవపడి చంపుతానని బెదిరించినట్లు శ్రీనివాసరావు భార్య ఝాన్సీ వివరించింది. మిగిలిన ఎకరం చెరువు దగ్గరకు కూడా వెళ్లకుండా దుర్భాషలాడుతూ దాడికి యత్నిస్తున్నాడని వాపోయింది. పోతురాజుకు కన్నా శ్రీనివాసరావు అనే వ్యక్తి మద్దతుగా తమను బెదిరిస్తున్నాడని ఆమె వివరించింది. అడువుల దీవి పోలీసుస్టేషన్‌లో తమపై కేసులు పెట్టి ఇబ్బంది పెడుతున్నాడని ఇక చేసేది లేక ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేసేందుకు వచ్చినట్లు తెలిపారు. ఆత్మహత్యయత్నం చేసిన కుటుంబాన్ని పోలీసులు అడ్డుకుని ఆసుపత్రికి తరలించారు. శ్రీనివాసరావు కుటుంబం ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటనపై ఎస్పీ తుషార్ డూడీ తీవ్రంగా స్పందించారు. వారికి ఎస్కార్ట్ ఇచ్చి రేపల్లె రూరల్ సీఐ పి.సురేష్ దగ్గరకు పంపించారు. నిజాంపట్నం తహసీల్దార్‌తో కలిసి వెళ్లి గ్రామంలో క్షేత్ర స్థాయి విచారణ చేపట్టి వెంటనే రిపోర్ట్ ఇవ్వాలని ఆదేశించారు.

పొన్నెకంటి పోతురాజు ట్రస్ట్ భూ విరాళం

మంత్రి మనోహర్ సమక్షంలో రూ.కోటి విలువైన భూమి పత్రాలు అందజేత

కొలకలూరులో 'సెర్ప్' పరిశ్రమకు సహకారం

స్ఫూర్తితో అభివృద్ధికి రూ.10 లక్షలు ప్రకటించిన మంత్రి

తెనాలి రూరల్, జూన్16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రోల్ మోడల్ పంచాయతీగా కొలకలూరును తీర్చిదిద్దుతామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. తెనాలి మండలం కొలకలూరు గ్రామంలో సెర్ప్ ఆధ్వర్యంలో చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు గానూ పొన్నెకంటి పోతురాజు ట్రస్ట్ నిర్వాహక కుటుంబ సభ్యులు పొన్నకంటి సువర్చల శశికిరణ్ మంత్రి మనోహర్‌ను కలిసి ప్రభుత్వానికి రూ.కోటి విలువజేసే ఎకరం పొలాన్ని విరాళంగా అందించారు. ఈ సందర్భంగా మంత్రి మనోహర్.. గ్రామాభివృద్ధికి మంచి మనస్సుతో ముందుకు వచ్చిన దాతలను అభినందించారు. ఈ స్థలంలో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ ఏర్పాటు చేసి, స్థానికంగా ఉండే మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించి వారి ఆర్థిక స్వావలంబనకు బాటలు వేసేలా తీర్చిదిద్దుతామన్నారు. అందుకు స్వయంగా మంత్రి మనోహర్ తన కుటుంబం తరుపున రూ.10 లక్షలు విరాళంగా అందించనున్నట్లు ప్రకటించారు. ఈ కాంప్లెక్స్ మూడు అంతస్తులుగా నిర్మించనున్నారు. అందులో మహిళలకు, నిరుద్యోగులకు, స్వయం ఉపాధి పొందేలా శిక్షణ కార్యక్రమాలు చేపట్టి స్వయంగా.. వారి కాళ్లపై వారు నిలిచేలా ప్రోత్సహించనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టును త్వరితగతిన ప్రారంభించి రాబోయే మూడు నాలుగు నెలల్లో పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురానున్నారు. మనోహర్ మాట్లాడుతూ తండ్రి పోతురాజు స్ఫూర్తితో కుమార్తె సువర్చలా శశికిరణ్ తన గ్రామానికి మంచి చేయాలని మంచి ప్రభుత్వానికి స్థలాన్ని అందించాలని ముందుకు రావడం సంతోషంగా ఉందన్నారు. తాను పుట్టిన ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకోవాలని, ఇక్కడ ప్రజలకు మంచి జరగాలని అనునిత్యం తపించే మంచి వ్యక్తిత్వం కలిగిన నాయకుడు మంత్రి మనోహర్ అని స్థల దాత పొన్నెకంటి సువర్చల శశికిరణ్ అన్నారు. ప్రజల శ్రేయస్సు కోసం తపించే మంచి వ్యక్తిత్వం కలిగిన నాయకుడని విశ్వసించి ఆయన ద్వారా భూమిని అందించేందుకు ముందుకు వచ్చామన్నారు. రాష్ట్రంలోనే కొలకలూరు గ్రామం అభివృద్ధి పథంలో నడుస్తుందని తాము నమ్ముతున్నట్లు తెలిపారు.

హామీ మేరకు తల్లికి వందనం అమలు

● ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

నరసరావుపేట టౌన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం హామీ మేరకు తల్లికి వందనం ఎంత మంది పిల్లలు ఉన్నా అంతమందికీ అమలు చేసిందని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. సోమవారం పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో విద్యార్థుల తల్లులు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. మొన్నటిదాక ప్రతిపక్షం సూపర్ సిక్స్ ఏమైందని క్యాంపెయిన్ చేసిందని, ఇప్పుడు తల్లికి వందనం నగదు జమచేయడం ప్రారంభం కాగానే ఇందులో రూ.2 వేలు ఏమైంది, మంత్రి లోకేశ్ ఖాతాలోకి వెళ్లాయి అంటూ దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. గతంలో కూడా రూ.2 వేలు తీసుకున్నారని, ఇప్పుడు కూడా ఆ నగదు పాఠశాల నిర్వహణకు ఖర్చుపెట్టడం జరుగుతుందని స్పష్టం చేశారు. మంత్రి లోకేశ్ ముందుకు వచ్చి తనపై వచ్చిన ఆరోపణలు నిరూపించాలని చాలెంజ్ విసిరినా.. కనీసం దాని గురించి మాట్లాడింది లేదన్నారు. ఒక మంచి పని చేస్తుంటే దానుంచి దృష్టి మరల్చ డానికి ఇలాంటి అబాండాలు వేయడాన్ని రాష్ట్ర ప్రజలు గుర్తుంచు కోవాలన్నారు. 15 రోజుల్లో అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయం కూడా రైతులకు అందజేయడం జరుగుతుందన్నారు. మార్కెఫెడ్ ద్వారా బర్లీ పొగాకును చిత్తశుద్ధితో కొంటామని రాష్ట్ర ప్రభుత్వం చెప్పిందని, నిన్న వచ్చిన కేంద్ర మంత్రి కూడా దీనిపై సమీక్ష చేశారని చెప్పారు. పొగాకు కొనుగోలుపై ఆలోచిస్తున్నారని చెప్పారు. ప్రతి పక్షం దృష్టి మరల్చే రాజకీయం మానుకోవాలని, అదే పంథాలో పోతామంటే అధికార పక్షంలోని వారు చేతులు కట్టుకొని ఉండరని హెచ్చరించారు. ఈ సమావేశంలో జనసేన రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ జిలాని, టీడీపీ, కూటమి నాయకులు ఉన్నారు.

సంఘ్ డిప్యూటీ డివిజనల్ సెక్రటరీగా శ్రీనివాసమూర్తి



గుంటూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ డిప్యూటీ డివిజనల్ సెక్రటరీగా ఎల్.శ్రీనివాసమూర్తి నియమితులయ్యారు. ఈ మేరకు సంఘ్ 113వ జనరల్ కౌన్సిల్ సమావేశంలో ఎన్ఎఫ్ ఐఆర్ జనరల్ సెక్రటరీ మర్రి రాఘవయ్య ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీనివాసమూర్తి గుంటూరు డివిజన్‌లో సీటీఐ స్క్వాడ్‌గా విధులు నిర్వహిస్తున్నారు. తన నియామకానికి సహకరించిన సంఘ్ డివిజనల్ సెక్రటరీ వీవీ రమణయ్య, అధ్యక్షుడు వై.సురేష్‌బాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

'కో-ఆపరేటివ్' బ్యాంకు ఎంప్లాయీస్

అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

గుంటూరు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ కో - ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా కేవీ శివరావు, టి.శివకృష్ణ, కోశాధికారిగా పి.లక్ష్మీనారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కోనూరు గోపి ప్యానల్ విజయం సాధించింది. గుంటూరులో ఆదివారం అసోసియేషన్ జిల్లా మహా జన సభ అనంతరం ఎన్నికలు అర్ధరాత్రి వరకు ఉత్కంఠ భరితంగా సాగాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కో- ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకుల ఉద్యోగులు ఎన్నికలకు హాజరయ్యారు. ఎన్నికల అధికారి జి.నారాయణరెడ్డి అర్ధరాత్రి దాటిన తర్వాత కౌంటింగ్ ప్రక్రియ నిర్వహించి, ఫలితాలను ప్రకటించారు. జాయింట్ సెక్రటరీగా ఎం.మురళీ, అసిస్టెంట్ సెక్రటరీగా షేక్ జాన్‌బీ, డైరక్టర్స్‌గా జి.శ్రీనివాసరావు, కె.అనిత భావన, కె. భాగవతి, ఎం.ప్రవళిక, ఆర్.భాను, వి.నరేంద్రరెడ్డి ఎన్నికైనట్లు వెల్లడించారు. నూతన కార్యవర్గ సభ్యులకు బ్యాంక్ అధికారులు, ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

నకరికల్లులో 17వ శతాబ్దం నాటి విగ్రహం



నకరికల్లు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): నకరికల్లు నుంచి శివాపురం వెళ్లే రహదారి సమీపంలో సోమవారం 17వ శతాబ్దం నాటి విగ్రహం బయట పడింది. వీరుడు, తోడుగా భార్య ఉన్నట్టు ఈ విగ్రహం ఉంది. కుడి చేతిలో ఈటె, బల్లెం, ఎడమ చేతిలో కత్తి కలిగి ఉండటాన్ని బట్టి వీరుడు శత్రువును గాని, క్రూర జంతువును గాని వేటాడుతున్నట్లు చెక్కబడి ఉంది. తల భాగం లేక పోవడంతో ఆ స్థానంలో సిమెంట్‌తో చేసిన ఆనవాళ్లు కనపడుతున్నాయని, పల్నాటి సున్నపురాయితో ఈ విగ్రహం చెక్కినట్లు పురావస్తు పరిశోధకులు డాక్టర్ ఈమని శివ నాగిరెడ్డి తెలిపారు. ఈ విగ్రహాన్ని పరిశీలించిన ఆయన క్రీస్తు శకం 15వ శతాబ్దం నాటిదిగా తెలిపారు. వీరవంతుడు, అతని భార్య యుద్ధానికి సిద్ధం అన్నట్లుగా ఈ విగ్రహం చెక్కబడి ఉందని చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో వైద్యుడి మృతి



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వైద్యుడు వెంకటేష్

తెనాలి రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వైద్యుడు మృతి చెందిన ఘటన పట్టణంలోని వీఎస్సార్ కళాశాల వద్ద మంగళగిరి ప్రధాన రహదారిపై చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు.. తెనాలి పట్టణానికి చెందిన బి.వెంకటేష్ (35), స్నేహితురాలు యామినితో కలిసి సోమవారం సాయంత్రం విజయవాడకు బయలు దేరారు. మార్గ మధ్యలో ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను ఓవర్‌టేక్ చేసే క్రమంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి ట్రాక్టర్‌ను ఢీ కొట్టారు. దీంతో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. 108 అంబులెన్స్‌లో క్షతగాత్రులను వైద్యశాలకు తరలించగా వెంకటేష్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. యామిని చికిత్స పొందుతోంది. మృతుడు తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాల డయాలసిస్ విభాగంలో ప్రైవేట్ మెడికల్ ఆఫీసర్‌గా పని చేస్తున్నారు. డాక్టర్ మృతి చెందడంతో పలువురు వైద్యులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

దొంగతనం కేసులో జైలు శిక్ష

కొల్లూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): నగలు దొంగతనం కేసులో నేరం రుజువు కావడంతో తెనాలి రెండవ అదనపు మున్సిఫ్ మేజిస్ట్రేట్ బి.రాజశేఖర్ ముద్దాయి మర్రి వెంకయ్యకు ఆరు నెలలు జైలు శిక్ష విధించారు. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. కొల్లూరు గ్రామానికి చెందిన నంబూరి మధుసూదన్‌రావు నూతన గృహ ప్రవేశం 2021 ఆగస్టులో జరగగా.. కార్యక్రమానికి విచ్చేసిన ఆయన సోదరి పొన్నూరుకు చెందిన సంకాల లక్ష్మీసుకన్య బంగారు ఆభరణాలున్న బ్యాగు రాత్రి చోరీకి గురైంది. దీంతో అప్పటి ఎస్ఐ ఉజ్వల్‌కుమార్ కేసు నమోదు చేశారు. అదే నెలాఖరును హనుమాన్‌పాలెం కరకట్ట దగ్గర ఎస్ఐ యూ శ్రీనివాసరావు నిందితుడు మర్రి వెంకయ్యను అరెస్టు చేసి.. అతని నుంచి రూ.7.40 లక్షల నగదుతోపాటు సుకన్యకు చెందిన నగలను స్వాధీనం చేసుకున్నారు. అప్పటి తెనాలి రూరల్ ఇన్‌స్పెక్టర్ సుబ్రహ్మణ్యం కోర్టులో చార్జీషీటు దాఖలు చేశారు. సీనియర్ ఏపీపీ పరిశపోగు సునీల్‌కుమార్ కేసు వాదించగా కోర్టు హెడ్ కానిస్టేబుల్ మల్లేశ్వరరావు సహకారం అందించారు.

శారీరక, మానసిక ఆరోగ్యానికి యోగా దోహదం

❖ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య కె. మధుమూర్తి



వర్సిటీలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉన్నత విద్యా మండలి చైర్మన్ మధుమూర్తి, ఇన్‌చార్జి వీసీ గంగాధరరావు తదితరులు

పెదకాకాని, జూన్ 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ప్రాంగణంలో యోగా అవగాహన ర్యాలీ సోమవారం జరిగింది. వర్సిటీ మెయిన్ గేట్ నుంచి ఇండోర్ స్టేడియం వరకు బోధన, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య కె. మధుమూర్తి పాల్గొని, మాట్లాడారు. యోగా శారీరక, మానసిక, ఆధ్యాత్మిక ఆరోగ్యానికి ఎంతో ప్రయోజనకరమని ఆయన పేర్కొన్నారు. రోజువారీ యోగా అభ్యాసం సంపూర్ణ శ్రేయస్సుకు దోహదపడుతుందన్నారు. వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.గంగాధరరావు మాట్లాడుతూ యోగా భావోద్వేగ స్థిరత్వాన్ని కాపాడుకోవడంలో సహాయపడుతుందన్నారు. ఇన్‌చార్జి రెక్టార్, రిజిస్ట్రార్ ఆచార్య రత్న షీలామణి, ఆచార్య జి. సింహాచలం మాట్లాడుతూ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఈ నెల 18న వర్సిటీ ప్రధాన క్రీడా మైదానంలో సుమారు 10 వేల మందితో యోగాంధ్ర వేడుకలు జరుగుతాయని తెలిపారు. వరల్డ్ కమ్యూనిటీ సర్వీస్ సెంటర్ కోయంబత్తూర్ వర్సిటీ కో-ఆర్డినేటర్ ఎ. రాధిక వివిధ యోగాసనాలు చేయించారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఆచార్య పీపీఎస్ పాల్‌కుమార్, దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ఆచార్య వెంకటేశ్వర్లు, పరీక్షల కో-ఆర్డినేటర్ ఆచార్య రామచంద్రన్, రూసా డైరెక్టర్ ఆచార్య ఎస్ మురళీమోహన్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఆచార్య దివ్య తేజ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

మిర్చియార్డు గ్రేడ్-1 సెక్రటరీగా సుబ్రహ్మణ్యం కొనసాగింపు

గుంటూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డు (గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ) గ్రేడ్-1 సెక్రటరీగా సీహెచ్ సుబ్రహ్మణ్యం డిప్యూటేషన్‌ని కొనసాగిస్తూ మార్కెటింగ్ డైరెక్టర్ జి.సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రకాశం జిల్లా మద్దిపాడు ఏఎంసీ గ్రేడ్-1 సెక్రటరీ సుబ్రహ్మణ్యం డిప్యూటేషన్‌పై మిర్చి యార్డులో విధులు నిర్వహిస్తున్నారు. ఆయన డిప్యూటేషన్ ముగియగా.. తదుపరి ఉత్తర్వులు వెలువడేంత వరకు ఇక్కడే కొనసాగాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఇంటర్ బోర్డు ఆర్ఐఓగా సునీత



బాధ్యతలు స్వీకరిస్తున్న ఆర్ఐఓ సునీత

గుంటూరు (విద్య) జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ బోర్డు ఆర్ఐఓగా గర్నెపూడి సునీత సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్న ఆమెను బెల్లంకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా ప్రభుత్వం బదిలీ చేసింది. అక్కడ విధులు నిర్వహిస్తూనే గుంటూరు ఆర్ఐఓగా (ఎఫ్ ఏసీ) సునీత బాధ్యతలు నిర్వహిస్తారు. నూతన ఆర్ఐఓను అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

రేపు ఐటీఐలో క్యాంపస్ ఇంటర్వ్యూలు

గుంటూరు విద్య జూన్ 16 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలోని కలెక్టరేట్ ఎదురుగా ఉన్న ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈ నెల 18న క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు సహాయ సంచాలకులు సాయి వరప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు ఐటీఐ పూర్తి చేసిన విద్యార్థులు హాజరు కావాలన్నారు. వివరాలకు 99516 77559 నంబరుకు సంప్రదించాలని తెలిపారు.

కేసానుపల్లి పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

ఈవోపీఆర్డీకి షోకాజ్ నోటీసు

నరసరావుపేట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట మండలం కేసానుపల్లి పంచాయతీ కార్యదర్శి కె.భార్గవ్ శ్యామ్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ పి.అరుణ్‌బాబు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. నరసరావుపేట ఈవోపీఆర్డీ నాగానందంకు షోకాజ్ నోటీసు జారీ చేశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిచడంతో కలెక్టర్ చర్యలు తీసుకున్నారని డీపీవో నాగేశ్వరనాయక్ తెలిపారు. ఈ నెల 11న పెదతురకపాలెంలో నిర్మించిన గిరిజన గురుకుల పాఠశాల భవనాన్ని మంత్రులు గుమ్మడి సంధ్యారాణి, గొట్టిపాటి రవికుమార్ ప్రారంభించారు. కలెక్టర్, ఎమ్మెల్యేలు, ఎంపీ హాజరయ్యారు. పెదతురకపాలెం మార్గంలో కేసాను పల్లిలో పారిశుధ్యం అధ్వానంగా ఉండటాన్ని కలెక్టర్ అరుణ్‌బాబు గమనించారు. ఈ నేపథ్యంలో డీపీవోను విచారణకు ఆదేశించారు. పారిశుధ్యం పనులు నిర్వహించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించినట్టు డీపీవో నివేదిక మేరకు కలెక్టర్ అరుణ్‌బాబు కార్యదర్శి, ఈఓపీఆర్డీపై చర్యలు తీసుకున్నారు.

చికిత్స పొందుతూ బాలిక మృతి

చిలకలూరిపేట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట - నరసరావుపేట మార్గంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వెంకట శృతి(9) అనే బాలిక తీవ్రంగా గాయపడి గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందింది. పోలీసుల వివరాల మేరకు.. స్థానిక వైఎస్ఆర్ కాలనీకి చెందిన గాలేటి రాంబాబు అనే వ్యక్తి భార్య కావేరి, మేనకోడళ్లు వెంకటశృతి, బాలసాహితితో కలిసి ద్విచక్ర వాహనంపై ఆదివారం కనపర్రు చర్చికి ప్రార్థనలకు వెళ్తున్నాడు. బైకును ఆర్టీసీ బస్ ఢీకొట్టింది. బైక్ ట్యాంకుపై కూర్చుని ఉన్న వెంకటశృతి బస్సు చక్రాల కింద పడింది. ప్రమాదంలో రాంబాబు, భార్య కావేరి స్వల్పంగా గాయపడ్డారు.

సాగర్ సమాచారం

మాచర్ల రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం సోమవారం నాటికి 513.60 అడుగులు ఉంది. ఇది 137.86 టీఎంసీలకు సమానం. ఎస్ఎల్‌బీసీ 450 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 450 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.15 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	101, 109, 120
చికెన్ విత్ స్కిన్(కిలో)	194.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	204.00

51,956 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 54,117 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 51,956 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 6,027 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	9800	11200
334	9500	13500	**ఏసీ కామన్ వెరైటీ**		
నెంబరు. 5	10000	13000	334	9800	13400
273	10000	12400	నెంబరు. 5	10000	13500
341	10000	13500	273	10000	13000
4884	---	---	341	10000	13800
సూపర్ 10	---	---	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	14200	తేజ	10000	14500
షార్క్-1	---	---	బ్యాడిగి	10000	13400
బ్యాడిగి	10000	13000	దేవనూరు డీలక్స్	10000	13800
దేవనూరు డీలక్స్	10000	13000	తాలుకాయలు	4500	7000

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

బాధ్యతలు స్వీకరించిన అధికారులు



కమిషనర్ శ్రీనివాసులు

పిడుగురాళ్ల, జూన్ 16(ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్ల మున్సిపల్ కమిషనర్‌గా ఐ.శ్రీనివాసులు సోమవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. అదేవిధంగా మున్సిపల్ ఏఈగా వై రోహిణి, మున్సిపల్ మేనేజర్‌గా అబ్దుల్‌ఖాన్, జేఏవోగా అంజయ్య, ఎంపీడీవోగా శ్రీవాణిలు సోమవారం విధుల్లో చేరారు. పలు ప్రాంతాలలో పనిచేస్తున్న అధికారులు బదిలీపై పిడుగురాళ్లకు వచ్చారు.

మార్కాపురం నియోజకవర్గ
పార్టీ పరిశీలకుడిగా బాజీ చౌదరి



కనుమూరి బాజీ చౌదరి

సత్తెనపల్లి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా మార్కాపురం పార్టీ సంస్థాగత ఎన్నికల పరిశీలకుడిగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనుమూరి బాజీచౌదరిని పార్టీ అధిష్ఠానం నియమించింది. మార్కాపురం నియోజకవర్గ పార్టీ పరిశీలకుడిగా తనను నియమించినందుకు సోమవారం సీఎం చంద్రబాబు నాయుడుకు, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌కు బాజీచౌదరి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అప్పగించిన బాధ్యతలు తు.చ. తప్పకుండా నిర్వహించి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

ఈకేవైసీ అవసరం లేదు

● ఏడీఏ శ్రీకృష్ణదేవరాయలు

మాచవరం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకానికి ఈకేవైసీ ప్రస్తుతానికి అవసరం లేదని, రైతులు ఆందోళన పడాల్సిన అవసరం లేదని ఏడీఏ శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 20వ తేదీన అన్నదాత సుఖీభవ పథకం కింద రైతుల ఖాతాల్లో జమ చేయనున్న నగదుకు సంబంధించి ఈకేవైసీ చేయించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. దీంతో ఆయా గ్రామాల రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయ శాఖ సిబ్బంది గ్రామాల్లో ప్రచారం నిర్వహించి ఈకేవైసీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈకేవైసీ అవసరం లేదని, గతంలో ఉన్న జాబితాల మొత్తాన్ని ఆమోదించటం జరిగిందంటూ వ్యవసాయ శాఖ అధికారులకు సోమవారం ఆదేశాలు అందాయి. దీంతో ప్రస్తుతానికి ఈకేవైసీ అవసరం ఉండదని ఏడీఏ తెలిపారు.

● పిడుగురాళ్ల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకం, ప్రధానమంత్రి కిసాన్ పథకం కొరకు రైతులు రైతుసేవా కేంద్రాల్లో ఈకెవైసీ (వేలిముద్రలు) వేయాల్సిన అవసరం లేదని వ్యవసాయ అధికారి సంధ్యారాణి సోమవారం తెలిపారు. ప్రభుత్వమే ప్రతి రైతుకు సంబంధించి ఈకెవైసీ అప్‌డేట్ చేయడం వల్ల ప్రస్తుతం ఆ పథకాలకు సంబంధించి రైతులు ఎవరూ వేలిముద్ర వేయాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం విడుదల చేసినప్పుడు ఆయా పథకాలకు సంబంధించి నగదు రైతుల ఖాతాలలో జమ అవుతాయని ఆమె తెలిపారు.



కొత్తపల్లిలో ప్రీస్కూల్ పిల్లలకు పుస్తకాలు ఇస్తున్న ఎంపీపీ భూక్యా స్వర్ణమ్మబాయి

కొత్తపల్లి అంగన్‌వాడీలో బడిబాట

అచ్చంపేట, జూన్ 16(ఆంధ్రజ్యోతి): అచ్చంపేటలోని కొత్తపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎన్ మాణిక్యం ఐదు సంవత్సరాలు నిండిన పిల్లలకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. కొత్తగా జాయిన్ అయిన పిల్లలకు ప్రీస్కూల్ పీపీ-1, పీపీ-2 పుస్తకాలను ఎంపీపీ భూక్యా స్వర్ణమ్మబాయి, గ్రామ సర్పంచ్ కూకట్లపల్లి అయ్యపరాజు చేతుల మీదుగా పిల్లలకు అందించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గురజాల నియోజకవర్గ
సీపీఐ కార్యదర్శిగా రమణారెడ్డి



రమణారెడ్డి

దాచేపల్లి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): సీపీఐ గురజాల నియోజకవర్గ కార్యదర్శిగా వరుసగా మూడోసారి మందపాటి రమణారెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నారాయణపురంలో మందపాటి నాగిరెడ్డి కమ్యూనిటీ హాల్‌లో జరిగిన నియోజకవర్గ 9వ మహాసభల్లో కార్యదర్శిగా రమణారెడ్డిని పార్టీ నాయకులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులు కొమర వెంకటరావు, యడ్ల భాస్కర్, మురికిపూడి సరవయ్య, నవులూరి యలమంద, అన్నపురెడ్డి పిచ్చయ్య, అక్కినపల్లి బాలయ్య, లంకా శాంతి, వేముల వెంకటరెడ్డి, టీ సత్యనారాయణ, బుర్రి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా భ్రమరాంబ మల్లికార్జునస్వామి వార్షికోత్సవం

రాజుపాలెం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డిగూడెం గ్రామంలో ఉన్న భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్షికోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ఎక్కువ సంఖ్యలో వచ్చి పూజలు చేశారు. అనంతరం వారికి అన్నదానం చేశారు.

సాగర్ సిమెంట్ ఫ్యాక్టరీ ఉద్యోగి గుండెపోటుతో మృతి



వెంకటరెడ్డి (ఫైల్ ఫోటో)

దాచేపల్లి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నాయకుడు ఆకూరి వెంకటరెడ్డి(51) గుండెపోటుతో మృతిచెందారు. మృతుడు వెంకటరెడ్డి సోమవారం దాచేపల్లి మండలం గామాలపాడు సమీపంలోని సాగర్ సిమెంట్ ఫ్యాక్టరీలో విధులు నిర్వహిస్తుండగా గుండెపోటు వచ్చి అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. తోటి ఉద్యోగులు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టుగా వైద్యులు తెలిపారు. వెంకటరెడ్డి రామాపురం మేజరు సాగునీటి సంఘం డీసీ వైస్ చైర్మన్‌గా ఉన్నారు. గ్రామంలో టీడీపీ క్రియాశీలక నాయకుడిగా ఉన్నారు. వెంకటరెడ్డి మృతికి ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సంతాపాన్ని వ్యక్తం చేశారు. వెంకటరెడ్డి మృతితో నాగార్జున సాగర్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పులకూరి కాంతారావు, పిడుగురాళ్ళ మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ వేముల వినోద్‌రెడ్డి, రాష్ట్ర టీడీపీ నాయకులు తంగెళ్ళ శ్రీనివాసరావు, బెల్లంకొండ బద్రి, నర్రా పుల్లయ్య, పగడాల భాస్కరరావు, అక్కినపల్లి బాలయ్య, వేముల తిరుమల కుమార్, రుద్రాల అచ్చారావు, పురంశెట్టి పరంజ్యోతి, సీపీఐ నాయకులు మృతదేహానికి నివాళులర్పించారు.

వీఆర్‌వోలుగా పదోన్నతి కల్పించాలి

నకరికల్లు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): వీఆర్‌ఏలకు వీఆర్‌వోలుగా పదోన్నతి కల్పించాలని తహసీల్దార్ కే పుల్లారావుకు వీఆర్‌ఏ యూనియన్ నాయకులు కాసులు, అంకమ్మలు వినతి పత్రం అందజేశారు. వీఆర్‌ఏల సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు.



వ్యవసాయ అధికారులకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

పొగాకు, మొక్కజొన్న సాగులో అప్రమత్తత అవసరం

● ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

మాచర్లటౌన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): పొగాకు, మొక్కజొన్న సాగులో నియోజకవర్గ రైతులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి సూచించారు. సోమవారం వెల్దుర్తి క్యాంపు కార్యాలయంలో ఖరీఫ్‌పై నియోజకవర్గ వ్యవసాయశాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఖరీఫ్‌లో విత్తే పంటలు, తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులు, పొగాకు, మొక్కజొన్న సాగు విస్తరణపై రైతులకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. పొగాకు, మొక్కజొన్న సాగు చేయాలని అనుకునే రైతులు మేలైన వంగడాలను ఎంచుకోవాలన్నారు. అలాగే కంపెనీలతో ముందస్తు ఒప్పందాలు పకడ్బందీగా చేసుకోవాలని సూచించారు. పత్తి, మిరప, వరి, అపరాల సాగుకు ముందు పచ్చిరొట్ట పైర్లు దుక్కుల్లో వాడేలా అవగాహన కల్పించాలన్నారు. సేంద్రియ ఎరువులను వాడేలా రైతులను ప్రోత్సహించాలన్నారు. ప్రభుత్వం రైతులకు అందించే విత్తనాలు, ఎరువులను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడీ జగదీశ్వరరెడ్డి, ఏవోలు పాపకుమారి, గంగాధర్, అమీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమ గురుకులానికి 5 ఎకరాల స్థలం కేటాయింపు

రెంటచింతల, జూన్ 16(ఆంధ్రజ్యోతి): మిట్టగుడిపాడు సమీపంలో గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల నిర్మాణానికి 5 ఎకరాల స్థలం కేటాయిస్తూ స్థానిక రెవెన్యూ అధికారులు పంపిన నివేదికను సోమవారం కలెక్టర్ అరుణ్‌బాబు ఆమోదించినట్లు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి చెప్పారు. ఆయన ఆంధ్రజ్యోతితో ఫోన్‌లో మాట్లాడుతూ దీని నిర్మాణానికి ఐటీడీఏ అధికారులు రూ.4కోట్ల 10లక్షలు విడుదల చేశారన్నారు. త్వరలో టెండర్ల ప్రక్రియ చేపడతామని చెప్పారు. మొదటి ఫేజ్‌లో 16 తరగతి గదులు, డార్మిటరీ, ఆటస్థలం, అంతర్గత రహదారులు నిర్మించనున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.



బుద్ధవనంలో ఏర్పాట్లు చేయిస్తున్న అధికారులు

18న యోగాంధ్రకు చురుగ్గా ఏర్పాట్లు

అమరావతి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా అమరావతిలో ఈనెల 18న జరిగే యోగాంధ్ర కార్యక్రమానికి ధ్యానబుద్ధ ప్రాంగణం, బుద్ధవనంలో చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆర్డీఓ రమణాకాంత్‌రెడ్డి ఆదేశాల మేరకు మండల స్థాయి అధికారులు పారిశుధ్య పనులను ఉపాధి హామీ కూలీలతో చేయిస్తున్నారు. మంగళవారం సాయంత్రానికి ఏర్పాట్లు పూర్తిచేయనున్నారు. బుధవారం ఉదయం 6గంటల నుండి 8.30 వరకు యోగా కార్యక్రమం జరుగుతుంది. కార్యక్రమంలో జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, విద్యార్థులు, స్థానికులు సుమారు 2వేలకు పైగా పాల్గొనున్నారు. మండల ప్రత్యేక అధికారి రాజగోపాల్, తహసీల్దార్ డానియేలు, ఎంపీడీవో టీ పార్వతి, కే పద్మజ, ఆర్‌ఐ శిరోమణి ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు.

శ్రీభ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాలు

అచ్చంపేట, జూన్ 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదపాలెం గ్రామంలో సోమవారం శ్రీభ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి కల్యాణ మహోత్సవం జరిగింది. అనంతరం అన్న ప్రసాద వితరణ జరిగింది. ఆలయ కమిటీసభ్యులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయకమిటీ సభ్యులు పాటిబండ్ల వెంకట్రామయ్య, నెల్లూరి చంద్రబాబు, నెల్లూరి చినవెంకటయ్య, పాటిబండ్ల బాపిరాజు, చిరుమామిళ్ళ నరసింహారావు, నల్లమోతు హరిబాబు, కంభంపాటి సాంబశివరావు తదితరుల ఆధ్వర్యంలో జరిగాయి.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, జూన్ 16(ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో సోమవారం 20.98 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. లీకుల ద్వారా 300క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుందన్నారు.

పెగ్ మార్క్ ఏర్పాటు వాయిదా

అమరావతి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): రైల్వేలైను ఏర్పాటుకు సంబంధించి సోమవారం ప్రారంభించాల్సిన పెగ్‌మార్క్ ఏర్పాటును నాలుగు రోజులపాటు వాయిదా వేశారు. ఈ కార్యక్రమంలో రైల్వే, రెవెన్యూ, పోలీసు అధికారులు సంయుక్తంగా పాల్గొనాల్సి ఉండగా పోలీసు అధికారులకు పని వత్తిడి కారణంగా 19వ తేదీ తరువాత పెగ్‌మార్క్ కార్యక్రమం చేపట్టే అవకాశం ఉంది.

వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలి

అమరావతి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు మారినా తమ సమస్యలు పరిష్కారం కావడం లేదని వీఆర్‌ఏలు సోమవారం తహసీల్దార్ డానియేలుకు వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర వీఆర్‌ఏల సంఘం పిలుపు మేరకు మండల వీఆర్‌ఏల సంఘం ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. తెలంగాణా రాష్ట్రంలో వీఆర్‌ఏల పేస్కేలు పెంచి ఆదుకుందని ఈ రాష్ట్రంలో మాత్రం మంత్రుల చుట్టూ తిరిగినా ఫలితం లేదని వీఆర్‌ఏ సంఘ నాయకులు అన్నారు. అర్హతగల వీఆర్‌ఏలకు వీఆర్‌ఓలుగా పదోన్నతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బి.సూరిబాబు, కె.రాజు, కె.కోటేశ్వరరావు, భూషయ్య, జాన్‌బీ, ఎం సువార్త, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

82మంది ఉపాధ్యాయులకు స్థానచలనం

ఇటీవల జరిగిన ఉపాధ్యాయుల బదిలీల్లో అమరావతి మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో 82మంది ఉపాధ్యాయులకు స్థానచలనం కలిగింది. మండలం నుండి ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్‌లు 35మంది బయట మండలాలకు బదిలీ కాగా 30మంది అమరావతికి వచ్చారు. మరో 17మంది మండల పరిధిలోనే బదిలీ అయ్యారు. బదిలీ అయినవారు సోమవారం నూతన పాఠశాలల్లో బాధ్యతలు స్వీకరించారు.

బీజేపీ మండల నాయకుల సమావేశం

అచ్చంపేట, జూన్ 16(ఆంధ్రజ్యోతి): అచ్చంపేటలోని సాయి బాబా కల్యాణ మండపంలో బీజేపీ సుపరిపాలనకు 11 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మండల పార్టీ అభివృద్ధి తదితర అంశాలపై సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర ఎంపీపీల సంఘం అధ్యక్షుడు మేకల హనుమంతరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో అమరావతి మండల బీజేపీ అధ్యక్షుడు వాడపర్తి పుల్లారావు, జలసూత్రపు తిరుపతి స్వామి, మోదెల వెంకటేశ్వరరావు, ఏలూరి బాలస్వామి, పేలప్రోలు శ్రీనివాసరావు, కృష్ణా నాయక్, జలసూత్రపు గోపాలకృష్ణ పాల్గొన్నారు



పిడుగురాళ్ల: టీడీపీ నాయకుల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు, విద్యార్థులు

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

పిడుగురాళ్ల, జూన్ 16(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని లెనిన్‌నగర్ జడ్పీ హైస్కూల్, ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు కూటమి నేతలు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, విద్యామిత్ర కిట్లను అందజేశారు. కార్యక్రమంలో పాండురంగ శ్రీను, తురకా వీరస్వామి, వడ్డవల్లి సర్వేశ్వరరావు, పిల్లి చెన్నారావు, వడ్డవల్లి సాంబశివరావు, సయ్యద్ అమీర్‌అలి, పణితి రవి, కార్ సైదా, టీడీపీ మస్తాన్ వలి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

● తల్లికి వందనం నగదు జమకావడంతో లెనిన్‌నగర్ ప్రాంత జడ్పీ, ప్రాథమిక పాఠశాలల విద్యార్థులు సోమవారం చంద్రబాబు, పవన్‌కల్యాణ్, లోకేశ్, ఎంపీ లావు, ఎమ్మెల్యే యరపతినేని చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు.

తల్లికి వందనం రానివారు సచివాలయాల్లో అర్జీ పెట్టుకోండి..

మాచవరం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం జాబితాలో పేర్లు లేనివారు ఆయా గ్రామ సచివాలయాల్లో అర్జీలు పెట్టుకోవాలని ఎంఈవో శ్రీధర్ సోమవారం తెలిపారు. 1వ తరగతిలో చేరేవారు, మొదటి సంవత్సరం ఇంటర్‌లో చేరేవారికి ఈనెల 30వ తేదీ వరకు జాబితాలు తయారు చేసి జూలై 5వ తేదీన నగదు జమ చేయటం జరుగుతుందని ఎంఈవో పేర్కొన్నారు. అనర్హత జాబితాలో పేర్లు ఉన్నవారు వాటికి సంబంధించి పత్రాలతో అర్జీలు పెట్టుకోవాలని సూచించారు.

తల్లికి వందనంతో తల్లిదండ్రుల్లో హర్షం

రెంటచింతల, జూన్ 16(ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం పథకంతో తల్లిదండ్రుల్లో హర్షం వ్యక్తమవుతోందని టీడీపీ మండల అధ్యక్షుడు అబ్బిరెడ్డి, మాజీ ఎంపీపీ సుమంత్‌రెడ్డి, పీహెచ్‌సీ మాజీ చైర్మన్ రామకృష్ణ అన్నారు. సోమవారం రెంటచింతలలోని ఆంజనేయస్వామి మాన్యం పాఠశాలలో తల్లికి వందనం లబ్ధిదారులతో కలిసి టీడీపీ నేతలు సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో టీచర్లు పాల్గొన్నారు.

అందుకూరులో సంబరాలు

క్రోసూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అందుకూరు ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం తల్లికి వందనం సంబరాలు నిర్వహించారు. గ్రామపెద్దలు, పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు పాఠశాల ఆవరణలో సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చిత్రటాలకు క్షీరాభిషేకం చేశారు. అనంతరం విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్ అందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వాసిరెడ్డి వీరభద్రం, చావా మురళీ, వాసిరెడ్డి మురళీ, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ కోటేశ్వరి, గ్రామ పెద్దలు తాళ్ళూరి శ్రీనివాసరావు, శేషగిరి, తిరుమలరావు, హెచ్‌ఎం తిరుమలరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్ శవ రాజకీయాలు మానుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

సత్తెనపల్లి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శవ రాజకీయాలు మానుకోవాలని కూటమి నేతలు అన్నారు. సోమవారం టీడీపీ ప్రజావేదికలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సత్తెనపల్లి మండలం రెంటపాళ్ల వైసీపీ ఉపసర్పంచ్ నాగమల్లేశ్వరరావు బెట్టింగ్‌లు, ఆర్థిక, కుటుంబసమస్యలతో ఆత్మహత్య చేసుకున్నారన్నారు. ఎన్నికల ఫలితాలపై ఆయన బెట్టింగ్‌లకు కూడా పాల్పడినట్లు ఆరోపించారు. వైసీపీ నాయకులు రౌడీషీటర్లకు కొమ్ము కాస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో గంజాయి, మద్యం తప్ప జరిగిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తుంటే.. అమరావతి అభివృద్ధి జరుగుతుంటే ఓర్వలేక వైఎస్ జగన్ శవ రాజకీయాలు చేస్తున్నాడన్నారు. జగన్ పర్యటనను అడ్డుకుంటామన్నారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తుందని చెప్పటం సరికాదన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు తాత జయప్రకాష్ నారాయణ, ఎలిసేడి రామస్వామి, చౌట శ్రీనివాసరావు, భీమినేని వందనాదేవి, మక్కపాటి రామచంద్రరావు, ఆళ్ళ అమరేశ్వరరావు, ఆళ్ళ సాంబయ్య, పూజల వెంకటకోటయ్య, ఏకుల రాజశేఖర్, బలిజేపల్లి సురేష్ కుమార్, కోమటినేని శ్రీనివాసరావు, కట్టా శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రి నిర్మాణానికి నిధులివ్వలేదనడం హాస్యాస్పదం

దాచేపల్లి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణపల్లిలోని ప్రభుత్వ ఆస్పత్రి నిర్మాణానికి కూటమి ప్రభుత్వం నిధులు ఇవ్వలేదని.. ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని టీడీపీ నాయకులు అన్నారు. వైసీపీ హయాంలో దాచేపల్లిలో నిర్మాణం పూర్తికాకుండా ఆస్పత్రిని ప్రారంభించి ఇప్పుడు నిర్మాణానికి నిధులివ్వాలని కోరటం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తుందని ఆరోపించటం, పోలీసులను గుర్తుపెట్టుకొని ఇబ్బంది పెడతామని హెచ్చరించటం వైసీపీ నేతల దుర్మార్గ ఆలోచనలకు నిదర్శనమన్నారు. మాజీ సీఎం జగన్‌రెడ్డి సత్తెనపల్లిలో మాజీ సర్పంచ్ విగ్రహావిష్కరణకు రావటం, సభలు ఏర్పాటుచేయటం చూస్తే ఆయనకు మతిస్థిమితం లేనట్లు అర్థమవుతోందన్నారు. గత ఐదేళ్లలో ప్రజల మధ్యకు రాకుండా పరదాల చాటున తిరిగిన జగన్ ఇప్పుడు ప్రజల్లోకి వచ్చి పోలీసులపై నోరు పారేసుకోవటం, తప్పుడు ప్రకటనలు చేయడం సరికాదన్నారు. అక్రమాలకు చిరునామాగా ఉన్న కాసు మహేష్‌రెడ్డి ప్రజాసమస్యలపై మాట్లాడటం, అవినీతి గురించి చెప్పటం హాస్యాస్పదంగా ఉందన్నారు. సమావేశంలో పార్టీ నేతలు బెల్లంకొండ బద్రి, వేముల తిరుమల కుమార్, నర్రా పుల్లయ్య, అక్కినపల్లి బాలయ్య, పగడాల భాస్కరరావు, పాముల కిషోర్, కొప్పుల నాగేశ్వరరావు, రుద్రాల అచ్చారావు, బొమ్మిరెడ్డి నారాయణ, వేముల కృష్ణ, మాశెట్టి బుజ్జి, వెలిశెట్టి అప్పారావు, ముస్యం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా నగేష్ బాధ్యతల స్వీకరణ

ముప్పాళ్ళ, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ముప్పాళ్ళ తహసీల్దార్‌గా కటకం నగేష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గురజాలలో విధులు నిర్వహిస్తూ బదిలీపై ముప్పాళ్ళ వచ్చారు. గతంలో పనిచేసిన భవానీ శంకర్ గత నెల 31న ఉద్యోగవిరమణ చేశారు. ముప్పాళ్ళ వ్యవసాయశాఖ అధికారి సింగంపల్లి శ్రీధర్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఆయన సత్తెనపల్లి నుంచి బదిలీపై ముప్పాళ్ళ వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న అరుణ బదిలీపై వ్యవసాయశాఖ జిల్లా వనరుల కేంద్రానికి వెళ్ళారు.

దేచవరం పశు వైద్యాధికారిగా వంశీ ప్రసాదు

నకరికల్లు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): దేచవరం వీఏఎస్‌గా డీ వంశీప్రసాదు, సంతగుడిపాడు వీఏఎస్‌గా ఎన్.సుజాత, రొంపిచర్ల వీఏఎస్‌గా కరణాకరరెడ్డి, రూపెనగుంట్లకు జేవీవోగా పుల్లయ్యచౌదరి, కండ్లకుంటకు ఎం.రఘునాథరావు, చల్లగుండ్లకు నాగమణి, చేజర్లకు షరీఫ్, కుంకలగుంటకు వెంకట్రామయ్యలు బదిలీల్లో భాగంగా విధుల్లో చేరారు. నకరికల్లు ఎల్‌ఎఫ్‌ఏగా శివప్రసాదు, గోగులపాడు ఎల్‌ఎఫ్‌ఏగా శ్రీహరిరావు, అన్నవరప్పాడుకు జానీబాషా, రెడ్డిపాలెంకు వీఎల్‌వోగా ప్రసూన, పాలపాడుకు శ్రీహరి, వెంకటేశ్వరనాయక్, కర్లకుంట సాయిమహేష్‌రెడ్డి బదిలీ అయినట్టు తెలిపారు

ఏవోగా లక్ష్మారెడ్డి బాధ్యతల స్వీకారం

రెంటచింతల: మండల వ్యవసాయాధికారిగా సోమవారం బాధ్యతలు చేపట్టిన కట్టా లక్ష్మారెడ్డిని టీడీపీ మండల నేతలు ఘనంగా సన్మానించారు.

వ్యక్తిపై కత్తితో దాడి

మాచర్ల రూరల్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): వ్యక్తిపై కత్తితో దాడిచేసి గాయపరిచిన సంఘటన మండలంలోని తాళ్లపల్లి గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన చిల్లా బ్రహ్మయ్య పొలంలో అదే గ్రామానికి చెందిన కాటం పున్నారావు, పాండురంగయ్య గొర్రెలు మేత మేశాయి. ఈ విషయంపై బ్రహ్మయ్యకు, పున్నారావు, పాండురంగయ్యల మధ్య సోమవారం ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో బ్రహ్మయ్య చేతులను పున్నారావు గట్టిగా మెలవేసి పట్టుకోగా పాండురంగయ్య కత్తితో వీపు భాగాన పొడిచాడు. బ్రహ్మయ్య కేకలు వేయడంతో స్థానికులు అక్కడకు చేరుకోగా పున్నారావు, పాండురంగయ్య పరారయ్యారు. గాయాలపాలైన బ్రహ్మయ్యను పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించగా వైద్యులు చికిత్సనందిస్తున్నారు. బ్రహ్మయ్య ఫిర్యాదు మేరకు విజయపురిసౌత్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చినపర్లపాడుతండాలో ఐఆర్‌ఎస్ ప్రోగ్రాం

మాచర్లటౌన్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): జాతీయ మలేరియా నివారణలో భాగంగా వెల్దుర్తి మండలం ఉప్పలపాడు పీహెచ్‌సీ పరిధిలోని చినపర్లపాడుతండాలో అధికారులు ఐఆర్‌ఎస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మలాథియాన్ 25 శాతం మందును ప్రతి ఇంటి ఆవరణలో స్ప్రే చేశారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి లక్ష్మయ్య, సీహెచ్ శ్రీనివాసరావు, సూపర్‌వైజర్ నాగేశ్వరరావు, కొండలు, హెల్త్ అసిస్టెంట్స్ మురళీధర్, వాగ్యానాయక్, నాగం నాయక్, హరిణీబాయి, ఏఎన్‌ఎం సౌభాగ్య, ఆశా కార్యకర్త వాణిబాయి, సెక్రటరీ నాగులునాయక్ తదితరులు పాల్గొన్నారు.



మలాథియాన్ స్ప్రే చేయిస్తున్న అధికారులు



తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందిస్తున్న సీపీఐ నాయకులు

నిరు పేదలకు నివేశన స్థలాలు ఇవ్వాలి

అచ్చంపేట, జూన్ 16(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల్లో భాగంగా నిరు పేదలకు నివేశన స్థలాలు ఇచ్చి గృహ నిర్మాణాలు చేపట్టాలని పెదకూరపాడు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రాన్ని సీపీఐ నాయకులు అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ పేద ప్రజల తరుపున సీపీఐ పోరాడుతూనే ఉంటుందన్నారు. గృహ నిర్మాణానికి రూ.5లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ఎస్‌కే మస్తాన్, కార్యవర్గసభ్యులు సంపంగుల ఏడుకొండలు, ఎస్‌కే మౌలాలి, ఎస్‌కే జాన్సి, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



కన్నాను కలసిన నకరికల్లు టీడీపీ నేతలు

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి: ఎమ్మెల్యే కన్నా

నకరికల్లు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): టీడీపీ బలోపేతానికి పార్టీ నాయకులంతా కృషి చేయాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం సత్తెనపల్లిలో నూతనంగా ఎన్నికైన పార్టీ నాయకులు టీడీపీ సీనియర్ నేత నాగోతు శౌరయ్యతో కలసి కన్నాను కలిశారు. టీడీపీ నకరికల్లు మండల అధ్యక్షుడిగా వేల్పుల ఆవుల రాజు, గ్రామ టీడీపీ అధ్యక్షుడిగా ఆకుల పెద వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. రానున్న స్థానిక సంస్థల్లో పార్టీ అన్ని స్థానాల్లో గెలిచేలా కొత్త కార్యవర్గం పని చేయాలని కన్నా కోరారు.



ఉప ఖజానా అధికారిగా బాధ్యతలు స్వీకరించిన కుమార్‌ను సన్మానిస్తున్న పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు

పెన్షనర్ల సమస్యలు పరిష్కరిస్తా..

పెదకూరపాడు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): పెన్షనర్ల సమస్యలు పరిష్కరిస్తానని ఉపఖజానా అధికారి బీఆర్‌కే కుమార్ అన్నారు. సత్తెనపల్లిలో ఉపఖజానా అధికారిగా ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూ బదిలీపై వచ్చి పెదకూరపాడు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పెన్షనర్ల సంఘం ప్రతినిధులు మన్నవ వీరయ్య, గుంటుపల్లి కోటేశ్వరరావు, వై సుబ్బారావు, పీ వెంకటేశ్వరరావు, ఎన్ వెంకటేశ్వర్లు, షేక్ అమీర్‌ఖాదర్‌లు సత్కరించారు. కార్యక్రమంలో సీనియర్ అకౌంటెంట్ మధుబాబు, మనీష్ బాబు, శ్రీవల్లి తదితరులు పాల్గొన్నారు.



నియామక పత్రాలు అందజేస్తున్న వరప్రసాద్ యాదవ్

నియోజకవర్గ ఓబీసీ మహిళా అధ్యక్షురాలిగా అంజమ్మ

మాచర్ల రూరల్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఓబీసీ వెల్ఫేర్ అసోసియేషన్ మాచర్ల నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలిగా తురకా అంజమ్మ ఎన్నికయ్యారు. పట్టణంలోని ఓబీసీ కార్యాలయంలో సోమవారం ఈ ఎన్నిక జరిగింది. మాచర్ల మండల అధ్యక్షురాలిగా శివకుమారి, కార్యదర్శిగా బొమ్ము హనుమాయమ్మ, దుర్గి మండల అధ్యక్షురాలిగా తిప్పాబత్తుల రాణి, ఉపాధ్యక్షురాలిగా చిట్టేటి రమణ, కార్యదర్శిగా దేవళ్ల లక్ష్మమ్మ ఎన్నికయ్యారు. వీరికి ఓబీసీ సంఘ అధ్యక్షుడు, రైల్వే బోర్డు సలహాదారుడు అంకిరేకుల వరప్రసాద్ యాదవ్ నియామక పత్రాలు అందించారు.

దుర్గి మండల అధ్యక్షురాలిగా రాణి...

దుర్గి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఓబీసీ మహిళా సంఘం దుర్గి మండల అధ్యక్షురాలిగా తిప్పాబత్తుల రాణి ఎన్నికయ్యారు. ఈ మేరకు సోమవారం నియామక ఉత్తర్వులు అందుకున్నారు. మహిళల హక్కుల సాధనకు, సాధికారతకు కృషి చేయనున్నట్లు రాణి తెలిపారు.

ఇసుక అక్రమంగా తరలిస్తున్న లారీల పట్టివేత

అమరావతి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): తుళ్లూరు మండలం బోరుపాలెం నుండి ఇసుక అక్రమ లోడింగ్ చేసుకుని అమరావతి మీదుగా గుంటూరు, సత్తెనపల్లి వైపు వెళ్తున్న 8 లారీలను అదుపులోకి తీసుకుని వారి వద్ద ఎలాంటి బిల్లులు లేకపోవడంతో పోలీసులు స్టేషన్‌కు తరలించారు. రాత్రి 2గంటల సమయంలో నైట్ డ్యూటీ చేస్తున్న ఏఎస్ఐ మున్నయ్య ఇసుక లోడుతో వెళ్తున్న వాహనాలను సత్తెనపల్లి రోడ్ సెంటర్‌లో ఆపి అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించి పోలీసు స్టేషన్‌కు తరలించారు.

మందకొడిగా... మిర్చి ఎగుమతులు


మిర్చి ఎగుమతుల లోడింగ్ కోసం ఉంచిన కంటెయినర్లు

● మార్కెట్‌లో తగ్గిన జోష్ ● రోజుకు సగటును 35 వేల టిక్కీల విక్రయం

గుంటూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల అనంతరం మిర్చియార్డు ట్రేడింగ్ ప్రారంభమైనా కొనుగోళ్లు మందకొడిగా సాగుతున్నాయి. ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలల్లో ఉన్నంత వేగం ఇప్పుడు కనిపించడం లేదు. నాన్ ఏసీ మిరపకాయలు రాక పూర్తిగా తగ్గిపోయాయి. ఇప్పుడు మార్కెట్‌కి వస్తున్నదల్లా కోల్డ్‌స్టోరేజ్‌లలో నిల్వ చేసిన మిరపకాయలే. సీజన్‌లో చైనా, ఇండోనేషియా, బంగ్లాదేశ్‌కు డిమాండ్ మేరకు ఎగుమతులు జరిగాయి. ఇప్పుడు అరకొరగా తప్పితే ఎక్స్‌పోర్టు ఆర్డర్స్ ఎక్కువగా రావడం లేదు. దీంతో ఇతర సరుకులతో గుంటూరు నగరానికి వచ్చిన కంటెయినర్లు వాటిని ఇక్కడ దిగుమతి చేసేశాయి. తిరిగి చెన్నై వెళ్లేందుకు మిర్చి లోడింగ్‌ల కోసం ఎదురు చూస్తున్నాయి. చెన్నై పోర్టుకు కంటెయినర్లు లోడింగ్ ఉంటే చెప్పమని ఎగుమతిదారులకు పదేపదే ఆపరేటర్లు ఫోన్లు చేస్తున్నారు.

మిర్చి ఎక్స్‌పోర్టులలో చైనా ఆర్డర్లు 75 శాతం వరకు ఉంటాయి. మిగతా 25 శాతం ఇండోనేషియా, బంగ్లాదేశ్, థాయ్‌లాండ్, శ్రీలంక వంటి దేశాలకు వెళుతుంటాయి. చైనాకు ఏటా 2 లక్షల టన్నుల మిర్చి డిమాండ్ ఉండగా, ఈ ఏడాది 3 లక్షల టన్నులు ఎగుమతి అయ్యాయి. దీంతో అక్కడ నిండుగా సరుకు ఉండటంతో ఇప్పుడు అరకొరగానే దిగుమతిదారులు ఆర్డర్లు పెడుతున్నారు. ఇండోనేషియా, బంగ్లాదేశ్‌కి డిమాండ్ మేరకు ఎగుమతులు జరిగాయి. ఈ నేపథ్యంలో ఇప్పటి నుంచి మార్కెట్‌కు వచ్చే సరుకు అంతా స్థానిక అవసరాలకే వ్యాపారస్థులు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి తలెత్తింది.

ధర పెరుగుదల కోసం ఎదురు చూపు

మిర్చి ధర పెరుగుదల కోసం అటు రైతులు, ఇటు స్టాకిస్టులు వెయ్యి కళ్లతో ఎదురు చూస్తున్నారు. ఈ కారణంతోనే శీతల గిడ్డంగుల నుంచి కొద్దికొద్దిగా మిర్చి టిక్కీలను బయటకు తీసుకొచ్చి మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. ఎక్స్‌పోర్టర్లకు అవసరమైన నాణ్యత మేరకు మిరపకాయలు రాకపోతుండటంతో నిత్యం ఉదయం కమీషన్ ఏజంట్ దుకాణాల వద్దకు వచ్చి శాంపిల్స్ నాణ్యత చూసి వెనుదిరుగుతున్నారు.

పిడుగురాళ్లలోనే.. వ్యవసాయ పనిముట్లు

- ఇక గుడివాడకు వెళ్లాల్సిన పనిలేదు
- వ్యవసాయ యంత్రాలు ఇక్కడే తయారీ
- అందుబాటులో.. తక్కువ ధరకు
- రైతులకు లాభసాటి


పిడుగురాళ్లలో విక్రయానికి సిద్ధంగా ఉన్న దుక్కి దున్నే గొర్రు సెట్లు


తయారీ పూర్తవుతున్న ట్రాక్టర్ ట్రాలీలు

పిడుగురాళ్ల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయానికి పెట్టింది పేరుగా ఉన్న పల్నాడు ప్రాంతంలో ఆధునిక యంత్రాల కొనుగో లుకు రైతులు దశాబ్దాల పాటు గుడివాడ ప్రాంతాలకు వెళ్లేవారు. అక్కడ వ్యవసాయానికి అవసరమైన గొర్రు సెట్లు, దమ్ము చక్రాలు, ట్రాక్టర్ ట్రాలీలు తయారీకి ఆర్డర్ ఇచ్చేవారు. తయారీ పూర్తయ్యాక సొంత ప్రాంతాలకు తీసుకురావడం వ్యయప్రయాసాలతో కూడుకు న్నది. కాలక్రమేణ గుడివాడ ప్రాంతంలోని యంత్రాల తయారీ నిపుణులే పిడుగురాళ్లలో తమ పరిశ్రమలను ఏర్పాటు చేశారు. దీంతో సత్తెనపల్లి, గురజాల, మాచర్ల నియోజకవర్గాల పరిధిలోని సుమారు 20 మండలాలకు సంబంధించిన రైతులు, ట్రాక్టర్ల యజమానులు తమకు కావాల్సిన యంత్ర పరికరాలను అనుకూలమైన రీతిలో పిడుగురాళ్లలోనే తయారు చేయించుకుంటున్నారు.

ఏమేమి తయారు చేస్తారంటే..

ట్రాక్టర్ ట్రాలీలు, దమ్ము చక్రాలు, గొర్రు సెట్లు, ట్రాక్టర్ బ్లేడు, విత్తన గొర్రు సెట్లు, ఎరువుల వాడకానికి ఉపయోగించే గొర్రు సెట్లు, ట్రాక్టర్ ట్రాలీపై వాటర్ ట్యాంకర్‌ను తయారు చేస్తారు. గుడివాడలో యంత్రాల తయారీలో నిపుణులైన సిబ్బందే పిడుగురాళ్లలో పరిశ్రమలు పెట్టి యంత్రాలను తయారుచేసి రైతులకు సకాలంలో అందిస్తున్నారు. ఏడాదిలో 8 నెలల పాటు ఊపిరి సలపని పని ఉంటుంది. సీజన్ బట్టి వ్యవసాయ యంత్రాలు, ట్రాక్టర్ ట్రాలీలతో పాటు జనవరి నుంచి మే నెల వరకు వాటర్ ట్యాంకర్లు తయారీలో ఇక్కడి సిబ్బంది తలమునకలవుతుంటారు.

రైతులకు ఉపయోగకరం..

గుడివాడ ప్రాంతానికి వెళ్లి వ్యవసాయ యంత్రాలను తయారు చేయించాలంటే చాలా ఖర్చుతో కూడిన పని. ఇప్పుడు అంతకన్నా తక్కువ ధరకే పిడుగురాళ్ల ప్రాంతంలోనే యంత్రాలు తయారు చేయడంతో పాటు కాలానుగుణంగా ఆధునిక యంత్రాలను కూడా రైతులకు అందించడం వల్ల ఖర్చు, సమయం ఆదా అవుతుంది.



నిజాంపట్నం హార్బర్‌లో వేటకు బయలుదేరేందుకు బోట్లలలో పూజలు నిర్వహిస్తున్న మత్స్యకారులు

వేట..మొదలు

● హార్బర్‌లో చేపలవేటకు పయనమైన గంగపుత్రులు

రేపల్లె, జూన్ 16(ఆంధ్రజ్యోతి) : గంగ పుత్రులు సోమవారం చేపల వేటకు బయలు దేరారు. తీర ప్రాంతంలో వేట విరామం ముగియటంతో గ్రామదేవతకు, బోట్లకు, సముద్ర తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి సోమవారం తెల్లవారుజామున 4గంటలకు చేపల వేటకు పయనమయ్యారు. బాపట్లజిల్లాలో 80 కిలోమీటర్ల మేరా సముద్రతీరం ఉంది. మోటరైజ్డ్ బోట్లు 2,500ఉండగా, నాటుపడవలు 300, మెకనైజ్డ్‌బోట్లు 250ఉన్నాయి. తీరప్రాంతంలోని నిజాంపట్నం హార్బర్‌లో బోట్లు 300, ఇంజన్‌నావలు, మరపడవలు 350లు పైగానే ఉన్నాయి. సముద్రంలో వీరి వేట వారం పాటు కొనసాగుతుంది. దీనికి కావాల్సిన ఆహార పదార్థాలు, వేటకు కావాల్సిన సామగ్రిని వారి వెంట తీసుకెళ్లారు.


వేట విరామం అనంతరం చేపల వేటకు బయల్దేరిన బోట్లు,గంగపుత్రులు

చదువులకు.. శ్రీనిధి బాసట

● డ్వాక్రా మహిళల పిల్లలకు ప్రయోజనం

సత్తెనపల్లి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా మహిళల పిల్లల చదువులకు భరోసా ఇచ్చే విధంగా కూటమి ప్రభుత్వం కొత్త పథకానికి రూప కల్పన చేసింది. వారి విద్యా వికాసానికి దోహద పడేందుకు కేవలం నాలుగు శాతం వడ్డీతో శ్రీనిధి రుణాలు ఇవ్వాలని నిర్ణయించింది. ఈ పథకానికి ఎన్‌టీఆర్ విద్యా సంకల్పంగా నామకరణం చేసింది. సత్తెనపల్లి మండలంలో 1,785 డ్వాక్రా సంఘాలు ఉన్నాయి. మొత్తం 17,850 మంది వరకు సభ్యులు ఉన్నారు. ఈ సభ్యుల పిల్లలకు పథకం ద్వారా లబ్ధి చేకూరనుంది.

చదువులకు.. రూ.లక్ష వరకు!

కేజీ నుంచి పీజీ వరకు అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పథకాన్ని వర్తింప చేయనున్నారు. రుణాలను పూర్తిగా పిల్లల చదువుల కోసమే ఉపయోగించాల్సి ఉంది. ఫీజు చెల్లింపులు, పుస్తకాలు, యూనిఫాం, సాంకేతిక విద్య, సామగ్రి తదితరాల కొనుగోలుకు వీటిని ఖర్చు చేయవచ్చు. నివాస ప్రాంతాల నుంచి దూరంగా ఉండే విద్యాలయాలకు వెళ్లేందుకు వీలుగా సైకిళ్ల కొనుగోలుకు సైతం అనుమతిస్తారు. ఎందుకు ఖర్చు చేశామన్న రసీదును శ్రీనిధి అధికారులకు అందజేయాల్సి ఉంటుంది. సంఘంలో ఉన్న సభ్యులందరూ పథకాన్ని సద్వినియోగం చేసుకోవచ్చు. ఒక్కో విద్యార్థికి అవసరాన్ని బట్టి రూ.10 వేలు నుంచి రూ.లక్ష వరకు శ్రీనిధి బ్యాంక్ ద్వారా రుణాలు ఇచ్చేలా ప్రతిపాదనలు చేశారు. ఈ మొత్తాన్ని రెండు నుంచి మూడు సంవత్సరాల్లో వాయిదా రూపంలో తిరిగి చెల్లించాలి.



కౌలు రైతు సుఖీభవ అనండి

(5వ పేజీ తరువాయి)

కూడా లేని వారి సంఖ్య మూడు లక్షలకు పైమాటే. మొత్తం సాగులో దాదాపు 60 శాతం వాటా కౌలు రైతులదే. ఇందులో రకరకాల కారణాలతో సీసీఆర్ కార్డులు అందుతున్నది సగం మందికే. ఈ సగం మంది కౌలు రైతులు కూడా బ్యాంకు రుణాల దగ్గర నుంచి విత్తనాల రాయితీ వరకు నిర్లక్ష్యానికి గురవుతూనే ఉన్నారు.

జిల్లాల వారీగా సీసీఆర్‌సీ లక్ష్యాలివి

ఈ ఏడాది సీసీఆర్ కార్డుల జారీ విషయంలో బాపట్ల జిల్లాలో లక్ష మంది కౌలు రైతులకు అందించాలనే లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించింది. ఇప్పటి వరకు జారీ చేసింది 3,800 మాత్రమే. పల్నాడు జిల్లాలో 68 వేలు సీసీఆర్‌సీ కార్డులు అందించాల్సి ఉండగా ఇప్పటికీ జారీ చేసిన కార్డులు రెండు వేలు లోపే ఉన్నాయి. అదే విధంగా గుంటూరు జిల్లాలో 55 వేలు కార్డులు ఇవ్వాలని ప్రభుత్వం వ్యవసాయ శాఖకు లక్ష్యం నిర్దేశించగా ఇప్పటికీ జారీ చేసిన కార్డులు మూడు వేలు లోపే ఉండడం గమనార్హం. ఖరీఫ్ మొదలయ్యే నాటికే ఈ సీసీఆర్ కార్డుల ప్రక్రియ పెద్ద ఎత్తున ప్రారంభం కావాల్సి ఉండగా ఆ దిశగా వ్యవస్థలు సన్నద్ధం కాకపోవడం కూడా కౌలు రైతులకు శాపంగా మారింది.

సీసీఆర్ కార్డులే ప్రామాణికమైతే..

అన్నదాత సుఖీభవ పథకాన్ని వర్తింప చేయడానికి సీసీఆర్ కార్డులే ప్రామాణికమైతే అదే విష యాన్ని ప్రభుత్వం స్పష్టంగా చెప్పాలని కౌలు రైతులు డిమాండ్ చేస్తున్నారు. అసలు మార్గదర్శ కాలలో కౌలు రైతుల ఊసే లేకపోవడం మరింత గందరగోళ పరుస్తుందని వాపోతున్నారు. గతేడాది జారీ చేసిన సీసీఆర్‌సీ కార్డుల్లో జూలై మొదలుకుని నవంబరు చివరి వరకు వ్యాలిడిటీ ఉన్న కార్డుల సంఖ్య దాదాపు 50 వేలు వరకు ఉన్నట్లు తెలుస్తోంది. 11 నెలల కాల పరిమితితో ఇచ్చే సీసీఆర్ కార్డులను గతేడాది జూలై నుంచి నవంబరు వరకు కౌలు రైతులకు ఇస్తూనే ఉండ డంతో గడువు ఉన్న కార్డులు ఇంకా గణనీయంగానే ఉన్నట్లు క్షేత్రస్థాయి గణాంకాలు చెబుతు న్నాయి. వీటితోపాటు ఈ ఏడాది జారీ చేసిన కొత్త కార్డులు కూడా మూడు జిల్లాల పరిధిలో ఇప్పటికే పదివేల వరకు ఉన్నాయి.

పొంతనలేని సమాధానాలు

సీసీఆర్ కార్డుల వ్యాలిడిటీ విషయంలో యంత్రాంగం వైపు నుంచే పొంతనలేని సమాధానాలు వస్తున్నాయి. గతేడాది జారీ చేసిన కార్డులకు గడువు ఉన్నప్పటికీ దానితో సంబంధం లేదని ఇప్పుడు కొత్తగా జారీ చేసేవే ప్రామాణికమని చెబుతన్నారు. మరోవైపు ఈ కార్డుల జారీ ప్రక్రియ నత్తనడకన సాగడానికి కారణం ఇంకా కాలపరిమితి ఉండడాన్ని యంత్రాంగం చూపిస్తోంది. ప్రస్తుతం మనుగడలో ఉన్న సీసీఆర్ కార్డులను ఎనేబుల్ చేయడానికి తమకు ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదని, సొంత పొలం యజమానుల వివరాలే పంపమన్నారని అధికారులు చెబుతున్నారు.

వెంటాడుతున్న సాంకేతిక కష్టాలు

అన్నదాత సుఖీభవ పథకం అర్హతకు సంబంధించి పలు సాంకేతిక చిక్కులు భూ యజమానులను వెంటాడుతున్నాయి. వైసీపీ చేపట్టిన అస్తవ్యస్త రీ-సర్వే వల్ల వేల సంఖ్యలో భూ రికార్డులు తహసీల్దార్ల లాగిన్‌లకు చేరాయి. వీటి విషయంలో ఇంకా ఎలాంటి నిర్ణయానికి రాలేదని సమాచారం. ప్రతి ఒక్కరూ బయోమెట్రిక్ చేయించుకోవాలనే నిబంధనను ప్రభుత్వం తప్పనిసరి చేసింది. గత ప్రభుత్వంలో ఈ విధానంతో పాటు మొబైల్‌కు ఓటీపీ పంపి కూడా ప్రక్రియ పూర్తి చేయడంతో అన్నదాతలకు సులువుగా ఉండేది. ఇప్పుడు ఒక్క బయోమెట్రిక్ విధానాన్నే అమలు చేస్తుండగా పలు చోట్ల సర్వర్ సమస్యలతో రైతులు గంటల తరబడి పనులు మానుకుని నిరీక్షించాల్సి వస్తోంది.

సమగ్ర విచారణ జరపండి

● చిలకలూరిపేట మునిసిపాలిటీలో రూ.34 లక్షల కుంభకోణంపై ఎంపీ లావు లేఖ

చిలకలూరిపేట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట మునిసిపా లిటీలో జరిగిన రూ.34 లక్షల కుంభకోణంపై సమగ్ర విచారణ జరిపిం చాలని మునిసిపల్ శాఖ మంత్రి పి.నారాయణకు నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన మంత్రికి లేఖ రాశారు. సోమవారం వివరాలను వెల్లడించారు. కుంభకోణానికి బాధ్యులైన వారిపై చర్యలతో పాటు ఆ మొత్తాన్ని రాబట్టి మున్సిపల్ ఖజానాకు జమచేయించాలని ఎంపీ కోరారు. ఈ కుంభకోణంపై విజిలెన్స్ విచారణ కోరుతూ మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని రాసిన లేఖను కూడా ఆయన మంత్రి నారాయణకు పంపించారు.


చిలకలూరిపేట మునిసిపల్ కార్యాలయం

అసలేం జరిగిందంటే...

వైసీపీ హయాంలో చిలకలూరిపేట మునిసిపాలిటీలో ఈ కుంభకోణం జరిగింది. అవుట్ సోర్సింగ్ ఉద్యోగి గంగాభవాని అనే మహిళ ఈ వ్యవహారానికి ప్రధాన బాధ్యురాలిగా గుర్తించారు. ఆమెపై పోలీసు కేసు నమోదుకావడంతో.. చాలా కాలంగా పరారీలో ఉంది. ఈ వ్యవహారంలో మొత్తం రూ.34,34,397 కాజేశారు. అనేక సార్లు ఈ అంశం చిలకలూరిపేట మునిసిపల్ కౌన్సిల్ సమావేశాల్లో చర్చకు వచ్చింది. దీనిపై వివరాలు వెల్లడించాలని టీడీపీ కౌన్సిలర్లు అధికారులను గట్టిగా నిలదీశారు. కానీ, అధికారులు స్పష్టత ఇవ్వకుండా కాలం గడిపారు. ఈలోగా కాజేసిన మొత్తంలో రూ.12 లక్షలు ఖజానాకు జమ అయ్యాయి. ఇంకా రూ.22 లక్షలకు పైగా జమ కావాల్సి ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు దీనిపై దృష్టి సారించారు. అనంతరం ఈ కుంభకోణంపై ప్రాథమిక విచారణ జరిగింది. మొత్తం 15 మంది మునిసిపల్ సిబ్బంది దీనికి బాధ్యులని విచారణలో తేల్చారు. వీరిలో ఒకరు చనిపోయారు. పలువురు వేర్వేరు మునిసిపాలిటీలకు బదిలీ అయ్యారు. అందులో బాధ్యులైన పది మందిని విధుల నుంచి సస్పెండ్ చేశారు. మరో నలుగురు ఉన్నతాధికారులపై చర్యలకు ప్రభుత్వానికి సిఫార్సు చేశారు. ఈ నేపథ్యంలో ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు లేఖ ప్రాధాన్యం సంతరించుకుంది.

సచివాలయ ఉద్యోగుల.. బదిలీలకు శ్రీకారం!

(5వ పేజీ తరువాయి)

క్యాన్సర్, ఓపెన్ హార్ట్ సర్జరీ, న్యూరో సర్జరీ, కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ సంబంధిత సమస్యలు ఉన్నవారికి బదిలీల్లో అధికా ప్రాధాన్యం ఇస్తున్నారు. అనారోగ్య సమస్యలు ఉన్నవారికి వైద్య సదుపాయాలు అందుబాటులో ఉన్నచోటికి బదిలీ అయ్యే అవకాశం కల్పించాలన్నారు. కాగా బదిలీపై వెళ్లే ముందు ఉద్యోగులు వారి బకాయిలను చెల్లించాలి. ఐటీడీఏ ప్రాంతాలకు బదిలీ అయినవారు తప్పనిసరిగా విధుల్లో లేకపోతే తీవ్ర చర్యలు ఉంటాయని ప్రభుత్వం స్పష్టం చేస్తోంది.

● షెడ్యూల్ ఇలా..

సచివాలయ ఉద్యోగుల బదిలీకి ప్రభుత్వం షెడ్యూల్ ప్రకటించింది. జూన్ 16న ప్రక్రియ ప్రారంభమై 30వ తేదీ నాటికి పూర్తి కావాలని నిర్దేశించింది.

తేదీ	ప్రక్రియ
జూన్ 15-16	ఉద్యోగి వివరాల నమోదు
జూన్ 16- 18	ఖాళీల నమోదు
జూన్ 22- 24	బదిలీలకు దరఖాస్తులు
జూన్ 25- 29	దరఖాస్తుల పరిశీలన- ఉత్తర్వుల జారీ
జూన్ 30(చివరిరోజు)	అభ్యంతరాల పరిష్కారం
జూన్ 30	అన్ని బదిలీలను పూర్తి చేయాలి
జూలై 10	ఉద్యోగుల వివరాలను హెచ్‌ఆర్‌ఎంఎస్ పోర్టల్లో అప్లోడ్ చేయాలి

అసాంఘికానికి.. రహదారి

● పట్టణ బైపాస్‌లో మద్యం సేవించి, బాటిళ్లతో వీరంగం

మాచర్లటౌన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మాచర్ల పట్టణంలో ట్రాఫిక్ రద్దీ తగ్గించేందుకు ఔటర్ బైపాస్‌ను ప్రభుత్వం మంజూరు చేసింది. శ్రీశైలం రోడ్డులోని విశ్వ బ్రాహ్మణ కాలనీ నుంచి గుంటూరు రోడ్డులోని శివప్రియ నగర్ వరకు సుమారు 8 కిలోమీటర్లు.. రెండు ఫ్లైఓవర్లు, చంద్రవంకపై హైలెవల్ బ్రిడ్జితో రహదారిని రూ. 89 కోట్లతో శరవేగంగా నిర్మిస్తున్నారు. రైల్వే ట్రాక్ బ్రిడ్జి తప్ప మిగతా పనులు పూర్తయ్యాయి. ఈ రహదారి విశాలంగా, నిర్మానుష్యంగా ఉండడంతో చీకటి పడితే చాలు మందుబాబులు గుంపులుగా మద్యం సేవిస్తూ.. ఖాళీ సీసాలను రోడ్డుపైనే పగలగొడుతున్నారు. ఎక్కడ చూసినా గాజు పెంకులే కనిపిస్తున్నాయి. గంజాయి వంటివి సేవించి ఘర్షణలకు కూడా దిగుతున్నారు. వాకింగ్ చేసే వారు అక్కడి వాతావరణం చూసి భయపడుతున్నారు. సమీప పొలాల రైతులు పొలం పనులు ముగించుకొని చీకటి పడ్డాక బైపాస్ దాటి పట్టణంలోకి ప్రవేశించాలంటేనే హడలిపోతున్నారు. పట్టణానికి అవలి వైపున ఉన్న బైపాస్ పోలీసులకు సవాల్‌గా మారింది. సీసీ కెమెరాల ఏర్పాటుతో పాటు రాత్రిళ్లు డ్రోన్ సాయంతో అసాంఘిక శక్తులకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.


బైపాస్ రోడ్డులోని ఫ్లైఓవర్ బ్రిడ్జిలపై మందుబాబులు తాగి వదిలేసిన సీసాలు, గాజు ముక్కలు









పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

పాతూరులో చోరీ

నరసరావుపేట లీగల్, జూన్ 16, (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాతూరులో చోరీ జరిగినట్లు రెండో పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. పాతూరులోని విజయ చాముండేశ్వరి దేవాలయం వద్ద తడికిమళ్ళ పవన్ కుమార్‌కు చెందిన గృహంలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. పవన్ కుమార్ కుటుంబ సభ్యులు శనివారం మధ్యాహ్నం నుంచి శ్రీశైలం దైవ దర్శనానికి వెళ్లారు. తిరిగి ఆదివారం మధ్యాహ్నం వచ్చి ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తాళాలు ప్రధాన గేటు తాళాలు పగలగొట్టి ఉన్నాయి. బీరువాలో పరిశీలించి బంగారు ఆభరణాలు, పదివేల నగదు రెండు లాప్‌టాప్‌లు చోరీకి గురైనట్లు గమనించారు. ఈ మేరకు బాధితుడు పవన్ కుమార్ రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న రెండో పట్టణ సీఐ హైమారావు ఘటన ప్రదేశానికి వెళ్లి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రీ సర్వే తప్పులతో 'అన్నదాత' సుఖీభవకు ఎసరు

శావల్యాపురం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్వహించిన రీసర్వే ప్రక్రియలో జరిగిన తప్పులతో అన్నదాత సుఖీభవ పథకానికి చాలామంది రైతులు అర్హత కోల్పోయారు. శావల్యాపురం మండలంలోని కనమర్లపూడి, పోట్లూరు, వేల్పూరు, పిచికలపాలెం గ్రామాల్లో రీసర్వే పనులు జరగ్గా ప్రభుత్వం రైతులకిచ్చిన పట్టాదారు పాసు పుస్తకాల్లో రెవెన్యూ అధికారులు పట్టా భూములు కూడా ఈనాం భూములుగా నమోదు చేశారు. వేల్పూరులో గతంలో 100మంది రైతులకి ఈనాం భూములున్నాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో రైతులకు అందించిన రైతుభరోసా పథకం వారికి కూడా వర్తించింది. రీ సర్వే పూర్తయ్యాక మరో 100మంది రైతుల పట్టా భూములు కూడా ఈనాం భూములుగా నమోదు చేశారు. ఈనాం భూములుగా నమోదయిన కారణంగా ఇప్పుడు కూటమిప్రభుత్వం రైతులకందిస్తున్న అన్నదాత సుఖీభవ పథకానికి అనర్హులుగా నిర్ధారించడంతో అర్హుల జాబితాలో 200మంది రైతుల పేర్లు నమోదు కాలేదు. పలువురు రైతులు సోమవారం గ్రామ సచివాలయం వద్దకు వెళ్లగా వీఏఏలు ఈనాం భూములుగా నమోదయ్యాయని చెప్పడంపై వారు నిరాశకు గురయ్యారు. రీ సర్వేలో తప్పులు నమోదు చేయడంతో తాము పథకాన్ని కోల్పోయామని వాపోయారు. ప్రభుత్వం స్పందించి రీసర్వే తప్పులపై విచారణ జరిపి అర్హులకు పథకాన్ని వర్తింపజేయాలని కోరారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

రొంపిచర్ల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కే మాధ్యూబాబు సోమవారం తెలిపారు. మండలంలోని పలు అభివృద్ధి అంశాలు, అధ్యక్షుల అనుమతితో ఇతర అంశాలను చర్చించనట్లు పేర్కొన్నారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు హాజరు కావాలని కోరారు.

వైభవంగా వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం

రొంపిచర్ల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోగులపాడులోని వెంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. వార్షికోత్సవం సందర్భంగా స్వామి, అమ్మవార్లకు అర్చకులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం విశేష అలంకరణ చేశారు. స్వామివారికి జరిగిన కల్యాణోత్సవంలో దంపతులు పాల్గొన్నారు. స్వామివారి, అమ్మవార్లను భక్తులు దర్శించుకున్నారు. అనంతరం కోలాట కార్యక్రమం, అన్నదానం నిర్వహించారు.

సమాచారం ఇస్తేనే రైతు భరోసా కేంద్రాలకు రావాలి: ఏవో

రొంపిచర్ల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులు సమాచారం ఇస్తేనే రైతు భరోసా కేంద్రాలకు రావాలని ఏవో శివ లీల సోమవారం తెలిపారు. మండలంలో మొత్తం 252మంది ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉందన్నారు. విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌లు సంబంధిత రైతులకు సమాచారం ఇస్తారని తెలిపారు. ఈ విషయాన్ని రైతులు గమనించాలని కోరారు. కాగా రైతు భరోసా కేంద్రాల వద్దకు రైతులు అధిక సంఖ్యలో వచ్చారు. తల్లికి వందనం నగదుకు సంబంధించి ఖాతాలో నగదు జమకాని తల్లులు బ్యాంకుల వద్ద, నెట్ సెంటర్ల వద్ద బారులు తీరారు.

నాదెండ్ల ఏవోగా శ్రీలత బాధ్యతల స్వీకారం

నాదెండ్ల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండల వ్యవసాయ అధికారిగా తూబాటి శ్రీలత నియమితులయ్యారు. ఆమె సోమవారం విధుల్లో చేరారు. ఇక్కడ పని చేస్తున్న ఏ హరి ప్రసాదు యడ్లపాడుకు బదిలీ కాగా అక్కడ పనిచేస్తున్న శ్రీలత నాదెండ్లకు వచ్చారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

నూజెండ్ల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలో మధ్యాహ్న భోజనం నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని డీవైఈవో సుభానీ అన్నారు. సోమవారం మండలంలోని ములకలూరు జడ్పీ పాఠశాలను సందర్శించి రికార్డులు పరిశీలించి మధ్యాహ్న భోజనం నాణ్యతను తనిఖీచేశారు. అనంతరం విద్యార్థులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్ఎం పానకాలరెడ్డి, కే.లక్ష్మి, వకుళ, హారిక, రాజకుమారి, వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీవైఈవో సుభానీ

అర్జీల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

● కలెక్టర్ అరుణ్‌బాబు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఇతర అధికారులు

నరసరావుపేట టౌన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే అర్జీల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధపెట్టి బాధ్యతతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ పీ అరుణ్‌బాబు అన్నారు. నరసరావుపేటలలోని పల్నాడు జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని ప్రజల నుంచి 191 అర్జీలను స్వీకరించారు. వచ్చిన అర్జీలను ఆయా శాఖల అధికారులు సత్వరం పరిష్కరించేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే ప్రతి అర్జీకి అర్థవంతమైన సమాధానం ఇస్తూ త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే, డీఆర్‌వో మురళి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

గంగినేని కల్యాణి ప్రభుత్వ డిగ్రీ కళాశాలను పరిరక్షించాలంటూ విద్యార్థి సంఘాల నిరసన

వినుకొండలోని గంగినేని కల్యాణి ప్రభుత్వ డిగ్రీ కళాశాల భూమిని కొందరు రాజకీయ అండదండలతో స్వాహా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, వెంటనే చర్యలు తీసుకొని కాలేజీ స్థలాన్ని పరిరక్షించాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం నరసరావుపేటలోని పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద మెకాళ్ళపై కూర్చొని నిరసన వ్యక్తం చేసి, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 38 ఎకరాల ప్రభుత్వ డిగ్రీ కాలేజీ భూమిలో 5.10 ఎకరాల భూమికి రెవెన్యూ రికార్డులు మార్చి కాజేస్తున్నారని, ప్రభుత్వాన్ని నిషేధిత భూముల జాబితా 22(ఏ)లో సర్వే నెంబర్ 949 డిగ్రీ కాలేజీ భూమి నమోదైందన్నారు. 2021లో అప్పటి ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అనుచరులు డిగ్రీ కాలేజీ భూమిని స్వాహా చేసేందుకు ప్రయత్నించారన్నారు. కాలేజీ ఉద్యోగులు, విద్యార్థులు, విద్యార్థి సంఘ నాయకులు నిరసన కార్యక్రమాలు నిర్వహించారన్నారు. అప్పటి కలెక్టర్ శివశంకర్ లోతేటి స్పందించి కాలేజీ సందర్శించి రెవెన్యూ రికార్డులు పరిశీలించారన్నారు. డిగ్రీ కాలేజీ 38 ఎకరాలు ఉందని తేల్చి చెప్పారన్నారు. కాలేజీ భూమిని కాపాడుకునేందుకు విద్యార్థి సంఘ నాయకులు మహంకాళి సుబ్బారావు, సాగర్‌లు హైకోర్టును ఆశ్రయించగా స్టే ఇచ్చారన్నారు. హయ్యర్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపాల్ కమిషనర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ స్థలం 38ఎకరాలని హైకోర్టుకు నివేదిక కూడా ఇచ్చారన్నారు. కాలేజీ స్థలాన్ని సంబంధిత అధికారులు విచారించి నిగ్గుతేల్చి నివేదించాల్సిందిగా హైకోర్టు ఆదేశించిందని, అయితే మాజీ ఎమ్మెల్యేతో కుమ్మక్కైన డివిజన్, మండల రెవెన్యూ అధికారులు కలిసి 22(ఏ) జాబితాలో ఉన్న డిగ్రీ కాలేజీ భూమికి ఏకంగా కొనుగోలుగా నమోదు చేసి అక్రమదారులకు క్రయవిక్రయాలకు అవకాశాన్ని కల్పించారన్నారు. అవినీతికి పాల్పడిన రెవెన్యూ అధికారులపై, అందుకు కొమ్మూగాస్తున్న ఉన్నతాధికారులు, ప్రైవేట్ వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి మధు, రాష్ట్ర కార్యదర్శి బందెల నాసారజే, మహంకాళి సుబ్బారావు, డేవిడ్, మస్తాన్,రాజేష్, ఆదిత్య, శివ, సాల్‌మన్ తదితరులు పాల్గొన్నారు.



ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలుకు వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ కార్మికుల వినతి

చిలకలూరిపేట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట మున్సిపల్ కార్మికుల సమస్యలను తక్షణం పరిష్కరించాలని సీపీఐ ఏరియా ఇన్‌చార్జి కార్యదర్శి తాళ్లూరి బాబురావు కోరారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ పి.శ్రీహరిబాబుకు ఈ మేరకు వినతి అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు గ్లౌజులు, కొబ్బరి నూనె, చెప్పులు అందించాలన్నారు. మున్సిపల్ ఉద్యోగ, కార్మికుల వేతనాల చెల్లింపు, పనుల అప్పగింత నిర్వహణ సాంఘిక భద్రత మున్సిపల్ శాఖకే పూర్తి బాధ్యతలు ఉండాలని, ప్రైవేట్ కంపెనీ, ఏజన్సీలకు అప్పజెప్ప వద్దని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ సుభాని, ఏపీ మహిళా సమాఖ్య ఏరియా కార్యదర్శి చెరుకుపల్లి నిర్మల, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు అంజయ్య, ఏఐవైఎఫ్ నాయకులు మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.



సమస్యలపై కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న మున్సిపల్ కార్మికులు

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 81 ఫిర్యాదులు

నరసరావుపేట లీగల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో పాల్గొని ఎస్పీ కంచి శ్రీనివాసరావు ప్రజల నుంచి 81ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా వచ్చిన ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యం ఇచ్చి త్వరితగతిన పరిష్కరించేలా తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి ఫిర్యాదుదారుని సమస్య పట్ల శ్రద్ధ వహించి, నిర్ణీత గడువులోగా సదరు ఫిర్యాదులను పరిష్కరించడానికి కృషి చేయాలని సూచించారు.



ప్రజల వద్ద నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఎస్పీ కంచి శ్రీనివాసరావు

బొల్లాపల్లి మండలం చక్రాయపాలెం గ్రామానికి చెందిన కేతావత్ సూర్య నాయక్‌కు అదే గ్రామానికి చెందిన గతంలో లైన్ మెన్‌గా పనిచేస్తూ ప్రస్తుతం నరసరావు పేటలో పనిచేస్తున్న మూడవత్ బాబునాయక్ పొలం మోటార్లు ఇప్పిస్తానని నగదు తీసుకొని మోసం చేసినట్లు తగు న్యాయం చేయాలని ఫిర్యాదు చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ప్రజల ఫిర్యాదులను రాసి పెట్టడంలో పోలీస్ సిబ్బంది సహాయ సహాయ సహకారాలు అందించారు.

రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన

శావల్యాపురం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు చొరవతో గుంటూరు-గుంతకల్ రైల్వేమార్గంలోని శావల్యాపురం రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న 268-సీ రైల్వేగేటు వద్ద ఆర్‌యూబీ నిర్మాణానికి రంగం సిద్ధమైంది. రైల్వే ఉన్నతాధికారులు ఆర్‌యూబీ నిర్మాణానికి అనుమతులు మంజూరుచేసి సోమవారం శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. గంటవారిపాలెం డీసీచైర్మన్ మండలపు వెంకటనారాయణ, టీడీపీ నాయకులు పాల్గొని భూమిపూజ చేశారు. డీసీ చైర్మన్ వెంకటనారాయణ మాట్లాడుతూ మండలంలోని కారుమంచి, వయ్యకల్లు, గుంటుపాలెం, మతుకుమల్లి, బొందిలిపాలెం, శానంపూడి, ముండ్రువారిపాలెం, చిన్నకంచెర్ల, పిచికలపాలెం గ్రామాల నుంచి శావల్యాపురం, వినుకొండ, నరసరావుపేటలకు వెళ్ళే ప్రయాణికులకు మధ్యలో రైల్వేగేటు ఉండడంతో ఎన్నోఏళ్ళుగా ఇబ్బందులు పడుతున్నారని, ఆర్‌యూబీ నిర్మాణంతో ప్రయాణికులకు రైల్వే గేటు సమస్య తీరినట్లేనన్నారు. రూ.5కోట్లు వ్యయంతో ఆర్‌యూబీ నిర్మాణాన్ని చేపట్టేందుకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందని, ఐదునెలల వ్యవధిలో నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని గుత్తేదారు తెలిపారు. శావల్యాపురం టీడీపీ అధ్యక్షుడు నలమాటి వెంకటేష్, సీనియర్ నేత చెరుకూరి చౌదరి పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న డీసీ చైర్మన్ వెంకటనారాయణ

ఉప్పలపాడులో తల్లికి వందనంపై కృతజ్ఞతలు

నూజెండ్ల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పలపాడులో సోమవారం తల్లికి వందనం లబ్ధిదారులతో కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియ జేస్తూ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామానికి చెందిన కట్టెంపూడి ఇస్తేరమ్మ, పాపారావులకు ఐదుగురు పిల్లలకు సంబంధించిన తల్లికి వందనం నగదు తమ ఖాతాల్లో జమ కావటంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, జీడీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు చిత్రపటాలకు లబ్ధిదారులు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో వినుకొండ మార్కెట్ యార్డు చైర్మన్ మీసాల మురళీకృష్ణ యాదవ్, టీడీపీ నాయకులు లగడపాటి వెంకటరావు, రొడ్డా వీరాంజనేయరెడ్డి, వంకాయలపాటి పేరయ్య, జెడ్డా రామయ్య, తిప్పిరెడ్డి అంజిరెడ్డి, రొడ్డా నాగిరెడ్డి, నారాయణరెడ్డి, బత్తుల గోవిందరాజులు, రెడ్డి వెంకటరత్నం, పరబ్రహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఉప్పలపాడులో సీఎం, జీవీ, మక్కెన చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న మహిళ

దేశాన్ని అభివృద్ధి చేయడమే బీజేపీ లక్ష్యం

● మండలాధ్యక్షుడు శ్రీనివాసరావు

శావల్యాపురం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): భారతదేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధిపథంలో తీర్చిదిద్ది విజన్ 2047ను సాకారం చేయడమే లక్ష్యంగా కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని బీజేపీ మండలాధ్యక్షుడు గట్టుపల్లి శ్రీనివాసరావు అన్నారు. దేశంలో బీజేపీ 11ఏళ్ళ పాలన పూర్తయిన సందర్భంగా బీజేపీ కేంద్ర, రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు శావల్యాపురం మండలంలోని కారుమంచి, గుంటుపాలెం, బొందిలిపాలెం, కొత్తలూరు, ఇర్లపాడు గ్రామాల్లో బీజేపీ మండలాధ్యక్షుడు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వికసిత భారత్ సంకల్ప సభలను కూటమి నాయకులు సోమవారం ఘనంగా నిర్వహించారు. అక్కడ ఉన్న ఆదివాసీలను పరామర్శించి వారి స్థితిగతులను ఆరాతీశారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశంలో అభివృద్ధి, సంక్షేమం, దేశరక్షణ, అన్నివర్గాల పేదల అభ్యున్నతే లక్ష్యంగా బీజేపీ పాలన కొనసాగుతుందన్నారు. ఇన్‌చార్జి సర్పంచ్‌లు మద్దినేని ఆంజనేయులు, వెనిగండ్ల ఆంజనేయులు, సీనియర్ నాయకులు యరమాసు కోటేశ్వరరావు, కోటా హరిబాబు, గోపాళం శివప్రసాద్, పోలూరి సైదులు, శ్రీనివాసరావు, రావినూతల ఆదాము తదితరులు పాల్గొన్నారు.



బొందిలిపాలెంలో ఆదివాసీలను పరామర్శిస్తున్న బీజేపీ నేతలు



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్, మున్సిపల్ మాజీ చైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్త తదితరులు

అథ్లెటిక్స్‌లో సత్తాచాటిన ఎస్ఎస్ఎన్ విద్యార్థులు

నరసరావుపేట టౌన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ అథ్లెటిక్స్ ట్రాక్‌లో 14, 15 తేదీలలో జరిగిన రాష్ట్ర సీనియర్స్ అథ్లెటిక్స్ పోటీలలో ఎస్ఎస్ఎన్ విద్యార్థులు సత్తాచాటారని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంఎస్ సుధీర్ సోమవారం ఒక ప్రకటనలో అన్నారు. కళాశాలకు చెందిన కే ప్రసన్న కుమార్ వంద మీటర్ల పరుగు పందెంలో రజిత పతకం, 110 మీటర్ల పరుగుపందెంలో కాంశ్య పతకం, సీహెచ్ వెంకటమారుతి గురుశంకర్ 400మీటర్ల పరుగుపందెంలో కాంశ్యపతకం సాధించారన్నారు. విద్యార్థులను కళాశాల పాలకవర్గం అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్, కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ నాగసరపు సుబ్బరాయగుప్తా, జాయింట్ సెక్రటరీ ఊటుకూరి వెంకట అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వీ శ్రీనివాససాయి, పీడీ డాక్టర్ యక్కల మధుసూధనరావు, తదితరులు అభినందించారు.



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్ డాక్టర్ బి.రవి తదితరులు

అతిసార నియంత్రణపై క్యాంపెయిన్

నరసరావుపేట లీగల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ ఆదేశానుసారం ఈ నెల 16వ తేదీ నుంచి జూలై 31వ తేదీ వరకు అతిసార నియంత్రణపై క్యాంపెయిన్ నిర్వహించనున్నట్లు పల్నాడు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఈ కార్యక్రమంపై అవగాహన కోసం రూపొందించిన గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఐదు సంవత్సరాలలోపు పిల్లల్లో అతిసార మరణాలు లేకుండా చేయటమే కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అన్నారు. అతిసార నివారణకు ఓఆర్ఎస్ ద్రావణం, జింక్ మాత్రలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఆశాలు, ఆరోగ్య కార్యకర్తలు ఇంటింటికి తిరిగి ఐదు సంవత్సరాలలోపు పిల్లలు ఉన్న తల్లిదండ్రులకు అతిసారపై అవగాహన, నివారణ, ఓఆర్ఎస్ ద్రావణం, జింక్ మాత్రలపై అవగాహన కల్పిస్తారని అన్నారు. పాఠశాల పిల్లలకు చేతిపరిశుభ్రత, టాయిలెట్ల వాడకంపై ఆరోగ్య విద్య బోధిస్తారన్నారు. అంగన్వాడీ, పంచాయతీరాజ్, గ్రామీణ తాగునీటి సరఫరా, విద్యాశాఖల సహకారంతో కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ పద్మావతి, డాక్టర్ గీతాంజలి, మురళీకృష్ణ, డాక్టర్ హనుమకుమార్, స్టాటిస్టికల్ అధికారి, ఎన్ఆర్‌హెచ్ఎం జిల్లా ప్రోగ్రాం అధికారి తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన పేదల సొంత ఇంటికల నెరవేర్చాలి

● సీపీఐ కార్యదర్శి రాము డిమాండ్

వినుకొండ టౌన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలకు రెండు సెంట్లు స్థలం ఇచ్చి, రూ.5లక్షలు ఇంటి నిర్మాణానికి ఇవ్వాలని సీపీఐ పట్టణ కార్యదర్శి ఉలవలపూడి రాము ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలో ఓబయ్య కాలనీ సచివాలయం వద్ద మహిళలతో కలిసి సోమవారం నిరసన తెలిపారు. అనంతరం రాము మాట్లాడుతూ రాష్ట్రంలో గత వైసీపీ ప్రభుత్వం 32లక్షల ఇళ్ల స్థలాలను పేదలకు ఇచ్చామని, ఇంటి నిర్మాణానికి రూ.1.80 వేలు రుణాలను మంజూరు చేశామని చెప్పడం తప్ప ఎక్కడా ఇళ్ల నిర్మాణాలను చేపట్టలేదన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీమేరకు పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, అదేవిధంగా ఇంటి నిర్మాణం చేపట్టి పేదలకు రూ.5 లక్షలు మంజూరుచేసి పేదల సొంతింటి కల నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో 17 వార్డు కార్యదర్శి చెన్న కేశవులు, దేవరాజు, కుమారి, మేరీ, లక్ష్మి, విజయరాణి, అరుణ తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో పాల్గొన్న పల్నాడు జిల్లా వైసీపీ నేతలు

రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం

● మాజీ మంత్రి విడదల రజని

నరసరావుపేట రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): గడిచిన సంవత్సర కాలంలో రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలులో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి విడదల రజని తెలిపారు. పల్నాడు జిల్లా వైసీపీ కార్యాలయంలో సోమవారం రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ పాలన ప్రారంభమై సంవత్సర కాలం పూర్తయిన నేపథ్యంలో ఎన్నికల సమయంలో టీడీపీ చేసిన హామీలు వైఫల్యాలు తదితర అంశాలపై వైసీపీ ఆధ్వర్యంలో పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాజీమంత్రి విడదల రజని మాట్లాడుతూ రాష్ట్రంలో 87లక్షల మంది విద్యార్థులుండగా కేవలం 67లక్షల మందికి మాత్రమే తల్లికి వందనం అందజేశారని మిగిలిన 20లక్షల మందికి అన్యాయం చేశారన్నారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో పేదలకు వైద్యసేవలను దూరం చేశారన్నారు. రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యసేవలందిస్తున్న వైద్యశాలలకు ప్రభుత్వం నుంచి రూ.4000కోట్ల నిధులు విడుదల చేయకుండా ప్రభుత్వం తీవ్ర ఇబ్బందులు పెడుతోందన్నారు. మాజీ ఎమ్మెల్యే కాసు మహేశ్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతిపక్ష నాయకులపై దాడులు పెరిగాయని ఆరోపించారు. రాష్ట్రంలో అంబేద్కర్ రాజ్యాంగం బదులు రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారన్నారు. వైసీపీ నేత మేకపాటి గౌతంరెడ్డి మాట్లాడుతూ గత ఏడాదిగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ వైసీపీ ఆధ్వర్యంలో పుస్తకావిష్కరణ చేయడం జరిగిందన్నారు. ఈ నెల 18న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పల్నాడు జిల్లా సత్తెనపల్లికి రానున్న నేపథ్యంలో పల్నాడు జిల్లాలోని వైసీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలి రావాలని కోరారు.



సామూహిక అక్షరాభ్యాసంలో పాల్గొన్న కార్యదర్శి, అంగన్‌వాడీలు

గణపవరంలో సామూహిక అక్షరాభ్యాసం

నాదెండ్ల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గణపవరం గ్రామంలో 72మంది విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం జరిగింది. గ్రామంలోని 18 అంగన్‌వాడీ కేంద్రాలకు చెందిన 72మంది చిన్నారులకు ఒకేచోట కార్యదర్శి మారుతీబాబు, సూపర్‌వైజర్ శివకుమార్‌ల ఆధ్వర్యంలో ఈ అక్షరాభ్యాసం చేయించారు. ఐసీడీఎస్ అందజేసిన పలకలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మారుతీబాబు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలు చిన్నారుల చదువులకు పునాది అవుతాయన్నారు.

కార్యక్రమంలో తల్లిదండ్రులు, అంగన్ వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.